



నివాళులర్పిస్తున్న ఎంఏ గఫూర్, గౌస్‌దేశాయ్, సిపిఎం నాయకులు. ఇన్‌సెట్‌లో వీరారెడ్డి (ఫైల్)

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా - ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు - ఉపాధ్యాయులకు, లెక్చరర్లకు సన్మానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల కీలకపాత్ర పోషిస్తారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురు పూజోత్సవం-2025 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యే, ఇతర ప్రజా ప్రతినిధులుఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అధ్యాపకునిగా జీవితాన్ని ప్రారంభించి, భారత రాష్ట్రపతిగా సేవలు అందించి, భారతరత్నగా కీర్తింపబడిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టినరోజు సందర్భంగా ఉపాధ్యాయులను గౌరవించుకోవాలన్న ఉద్దేశంతో 1962 నుండి సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని దేశవ్యాప్తంగా జరుపుకుంటున్నామన్నారు. తల్లి, తండ్రి తర్వాత గురువును పూజించే సంప్రదాయం అనాదిగా వస్తోందన్నారు. ఈ సంప్రదాయం తరతరాలకు వర్ధిల్లాలని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. జీవితకాలంలో రోజుకు సుమారు 8 గంటలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలు, కళాశాలల్లో గడపడంవల్ల ఒక ప్రత్యేక అనుబంధం ఏర్పడుతుందన్నారు. విద్య మాత్రమే కాకుండా విలువలు, సమాజంలో ఎలా నడుచుకోవాలని నేర్పించడంలో ఉపాధ్యాయుల పాత్ర అపారమని కలెక్టర్ పేర్కొన్నారు. గత సంవత్సరం 5.15 లక్షల మంది విద్యార్థులు బడిలో ఉండగా, ఈ ఏడాది 5.22 లక్షల మంది విద్యార్థులు బడిలో ఉన్నారని తెలిపారు.. ఒకటవ తరగతిలో 7200 మంది విద్యార్థులు కొత్తగా ఎన్రోల్ అయ్యారని కలెక్టర్ తెలిపారు. 62 శాతం ఉన్న పదవ తరగతి ఉత్తీర్ణతను సవాలుగా తీసుకొని కమిట్మెంట్ తో పనిచేసి సప్లిమెంటరీ ఉత్తీర్ణతతో 89 శాతం చేర్చడంలో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఇలానే పనిచేయాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలో హిందీ టీచర్ల కొరత ఉన్నదని, డిఇఒ తన దృష్టికి తీసుకురాగా వర్చువల్ విధానంలో డిజిటల్ క్లాసులను నిర్వహించి 99.5 శాతం హిందీ సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. వీటితోపాటు ఇతర సబ్జెక్టులు, నైపుణ్యాభివృద్ధి, ఐఎఎస్ ఫౌండేషన్ కోర్సులను కూడా వర్చువల్ విధానం ద్వారా నిర్వహించామన్నారు. విద్యా బోధనలో ఉన్న తృప్తి మరే ఉద్యోగం లో లేదని, తాను కూడా టీచర్ కావాలని సిల్వర్ జూబ్లీ కాలేజీలో బిఇడి చేశానన్నారు. తర్వాత మరో ఉద్యోగంలో చేరినందువల్ల టీచర్ కాలేకపోయానని, అయినప్పటికీ బోధన పట్ల ఉన్న మక్కువతో డిగ్రీ విద్యార్థులకు గణితం బోధించానని, ఏడాది పాటు డిఎస్‌సి విద్యార్థులకు కోచింగ్ ఇచ్చానని కలెక్టర్ పేర్కొన్నారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ ఎంపీ లాడ్స్ నిధుల నుండి కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి పాఠశాలకు రెండు కంప్యూటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. డిఎస్‌సిలో జిల్లాకు రాష్ట్రం లోనే అత్యధికంగా దాదాపు 2700 టీచర్ పోస్టులను భర్తీ చేశామన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని , ఉపాధ్యాయులు ఆదర్శప్రాయులు, మార్గదర్శకులు అని కొనియాడారు. అనంతరం 31 మంది ఉపాధ్యాయులకు, 14 మంది ఇంటర్మీడియట్ అధ్యాపకులకు కలెక్టర్ ఎంపీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావుయాదవ్, కార్పొరేటర్ పద్మలతారెడ్డి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కమ్మరి పార్వతి, రాష్ట్ర బొందిలి వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధారానగర్ విక్రమ్ సింగ్, డిఇఒ శామ్యూల్ పాల్, జడ్‌పి సిఇఒ నాసర రెడ్డి సమాజంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకం అని ప్రశంసిస్తూ ప్రసంగించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా



అవార్డులు అందజేస్తున్న అధికారులు



అవార్డులతో ఉపాధ్యాయులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

ప్రభాకర్‌రెడ్డికి పితృ వియోగం

- ఎంఏ.గఫూర్, గౌస్‌దేశాయి, తదితరుల నివాళి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.ప్రభాకర రెడ్డి తండ్రి కెసి.వీరారెడ్డి (88) అనారోగ్యంతో శుక్రవారం తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న ఆయన ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్య రావటంతో గురువారం కర్నూలు విశ్వభారతి హాస్పిటల్‌లో వైద్యం అందించారు. కోలుకోలేక శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటు వచ్చి కన్నుమూశారు. వార్త మెయిన్‌లో

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులివ్వాలి

- రాష్ట్ర కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు అన్నారు. శుక్రవారం కార్మిక కర్షక భవన్‌లో కర్నూలు రెవెన్యూ డివిజన్ కౌలు రైతుల విస్తృతస్థాయి సమావేశం రైతు సంఘం కర్నూలు మండల నాయకులు బాలపీర అధ్యక్షతన నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో గతం కంటే కౌలు సేద్యం పెరిగిందన్నారు. దేవాలయ, వక్ఫ్ భూములు వ్యవసాయ కూలీలు పేద రైతులు కౌలు సాగు చేస్తున్నారన్నారు. ప్రతి ఎకరాకు రూ.5,000 నుండి రూ.15వేల వరకు ముందుగా చెల్లించి సాగు చేస్తున్నారన్నారు. భూ యజమానులు కౌలు రైతుల మధ్య పోటీ పెట్టి ఎక్కువ కవులు దోచుకుంటున్నారని విమర్శించారు. వడ్డీ వ్యాపారస్తులు అధిక వడ్డీకి అప్పులు ఇచ్చి విపరీతంగా దోపిడీ చేస్తున్నారని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో కౌలు వ్యవసాయం చేసి తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. భూ యజమానులు గిట్టుబాటు ధరలు లేక వ్యవసాయాన్ని వదిలేస్తున్నారన్నారు. అధిక వర్షాలు కరువుల వల్ల దిగుబడి అంతంత మాత్రమే ఉంటుందని చెప్పారు. అధిక వర్షాల వల్ల పంటలన్నీ దెబ్బతిన్నాయని ఉల్లిపంట ధర పూర్తిగా పడిపోయిందన్నారు. వేరుశనగ పత్తి మిరప పంటల ధరలు పెరగడం లేదు. వీటి వల్ల సాధారణ రైతు కంటే కౌలు రైతులకు నష్టపోతున్నారన్నారు. కౌలు రైతులను రైతులుగా గుర్తించడం లేదని వారికి బీమా పరిహారం పంట నష్ట పరిహారం వర్తింప చేయాలని కోరారు. 2011 కవులు చట్టాన్ని రద్దుచేసి కొత్తగా 2019 కౌలు చట్టాన్ని తెచ్చి ఎక్కువ మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోటకొండ సూరి, నాయకులు ఆంజనేయులు, బడేసాహెబ్, మృత్యుంజయుడు, గిడ్డయ్య, లక్ష్మిరెడ్డి, కౌలు రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరిబాబు

సౌకర్యాలు సవ్యంగా ఉండాలి

- ప్రభుత్వ సర్వజన హాస్పిటల్ సమీక్షలో మంత్రి టిజి.భరత్

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అన్ని సౌకర్యాలు సవ్యంగా ఉండాలని పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, మెడికల్ కాలేజీల అభివృద్ధి పనుల సమీక్ష సమావేశంలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంకాలం మెడికల్ కాలేజీ కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర పరిశ్రమలు వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ ఆస్పత్రి, మెడికల్ కాలేజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఆసుపత్రిలో వెహికల్ పార్కింగ్ ఈనెల 30లోపు ట్రాలీ ట్రాక్‌ను అక్టోబర్ 15 లోపు పూర్తి చేయాలని ఎపిఎంఐడిసి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలోని సిటీ స్కాన్‌ను పిపిపి మెయింటెనెన్స్‌కు ఇవ్వాలన్నారు. ఇప్పుడున్న 135 సిసిటివి కెమెరాలకు అదనంగా అవసరమైన చోట పది కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఆక్సిజన్ పైప్ లైన్లను త్వరగా ఏర్పాటు చేసుకోవాలని, బయోవేస్ట్ డిస్పోజల్‌ను రూల్స్ ప్రకారం చేయించాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను కండిషన్లలో ఉంచుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు మందులు బయట కొనమని డాక్టర్లు రాయకుండా ఆదేశించాలని సూపరింటెన్‌డెంట్‌ను ఆదేశించారు. ఆపరేషన్ థియేటర్లో సమస్యలు, క్రిటికల్ కేర్‌కు అవసరమైన విషయాలు రాతపూర్వకంగా విజయవాడలో సంబంధిత అధికారులతో మాట్లాడి చేయిస్తానన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతిరోజు దాదాపు 1000 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారన్నారు. పందుల సమస్య కూడా ఉన్నదని మంత్రి దృష్టికి తీసుకుని వచ్చారు. మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ విశ్వేశ్వర్‌రెడ్డిని ఆసుపత్రి, మెడికల్ కాలేజీ, హాస్టల్లో ఉన్న కుక్కలకు స్టెరిలైజేషన్ ఆపరేషన్లు చేయించి వాటిని బయట వదిలిపెట్టాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావలసిన రూ.80కోట్లకు అవసరమైన యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇచ్చే చర్యలు వెంటనే చేపట్టాలని ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి రావలసిందిగా క్యాన్సర్ ఆస్పత్రి సూపరిండెంట్ ప్రకాష్‌ను ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆసుపత్రి, మెడికల్ కాలేజ్ అధికారులు , హాస్పిటల్ డెవలఫ్‌మెంట్ కమిటీ మెంబర్లు కూర్చుని సమస్యలను చర్చించుకొని తన దృష్టికి తేవాలని మంత్రి ఆదేశించారు. పుల్లారెడ్డి డెంటల్ కాలేజ్ వారు హాస్పిటల్‌కు అవసరమైన 10 స్ట్రెచర్లు మంత్రి టిజి.భరత్ చేతుల మీదుగా అందించారు. జిజిహెచ్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ, కంటి ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, క్యాన్సర్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్ ప్రకాష్, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, జిజిహెచ్ అడ్మినిస్ట్రేటర్ హిందూ సుబ్రహ్మణ్యం, డిపిఎం ఉమా, మలేరియా ఆఫీసర్ నూకరాజు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్

సర్వీసు రోడ్లను మరమ్మతులు చేస్తాం

- పిపిఎస్ఎస్ నాయకులతో కలిసి హైవే రోడ్డు పర్యవేక్షకుల పరిశీలన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా ఆదేశాల మేరకు జాతీయ రహదారి కిరువైపులా శిథిలమైన సర్వీసు రోడ్లను హైవే పర్యవేక్షకులు రఘువర్ధన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. వెంటనే గుంతలు పడ్డ రోడ్లన్నీ మరమ్మతు పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. పిపిఎస్ఎస్ బృందం హైవే పర్యవేక్ష కులు గోవర్ధన్ రెడ్డితో కలిసి బళ్లారి చౌరస్తాలో ఎంజి పెట్రోల్ బంకు దగ్గర ఆంజనేయస్వామి గుడి ప్రక్కన శిథిలమైన రోడ్డును చూపారు. అనంతరం ఆటో నగర్ సమీపంలో మోరి (కల్వర్టు) శిథిలమై ఇనుప కడ్డీలు బయటికి వచ్చి వాహనాల టైర్లు పాడవుతున్నాయని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఎ.వెంకటేశ్వర్లు, ఇరిగినేని పుల్లారెడ్డి, మహమ్మద్ యునుస్, ఎస్.రమణ గౌడ్ తెలిపారు. నగరం మీదుగా వెళ్లే జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారన్నారు. ఎంజి పెట్రోలు దగ్గర పెట్రోల్ బంకు దగ్గర, ఆంజనేయ స్వామి గుడి పక్కన సర్వీసు రోడ్లపై పెద్ద గుంతలు పడి రాత్రి సమయాల్లో, వర్షం నీటిలో గుంతలు కనిపించక రోజూ ప్రమాదాలు జరుగుతున్నా ఇంతవరకు హైవే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. హైవే తరపున శుక్రవారం గుంతలను పరిశీలించి హామీ ఇచ్చినందుకు అభినందనలు తెలిపారు. సర్వీస్ రోడ్ల మరమ్మత్తులను నిర్లక్ష్యం చేస్తే హైవే రోడ్డుపై ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పిపిఎస్ఎస్ నాయకులు సివి.వర్మ, ఎస్. అన్వర్‌బాష, జి.నారాయణ పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న అహ్మద్ నక్స్‌బంది

మతసామరస్యానికి ప్రతీక మహ్మద్ ప్రవక్త సందేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మహమ్మద్ ప్రవక్త ఆశయాలను కొనసాగిస్తూ ఆయన అడుగుజాడల్లో నడవాలని ముఖ్య అతిథి హైదరాబాదుకు చెందిన అహ్మద్ నక్షబంది పిలుపునిచ్చారు. శుక్రవారం మిలాద్ ఉన్ నబి పండుగను పురస్కరించుకొని మహమ్మద్ ప్రవక్త జన్మ దినాన్ని కర్నూలు నగరంలో భక్తిశ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా ఘనంగా నిర్వహించారు. కర్నూలు సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో బార్గాహ్-ఎ-రోజా దర్గా, బార్గాహ్ హజ్రత్ లతీఫ్ లౌబాలి, మస్జిద్-ఎ-లాల్, ఖలీ కరీం మస్జిద్, మచ్చివాలే సాహెబ్ నివాసం , ఇతర ఆధ్యాత్మిక కేంద్రాల సహకారంతో జియారత్-ఎ-ఆసారే ముబారక్ ఘనంగా నిర్వహించారు. సెంట్రల్ మిలాద్ కమిటీ వ్యవస్థాపకుడు సయ్యద్‌షా షఫీ పాషా ఖాద్రీ , కమిటీ సభ్యులు కలిసి, బార్గాహ్ హజ్రత్ లతీఫ్ లౌబాలి దర్గా నుండి రాజ్ విహార్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆధ్యాత్మిక గురువులు సజ్జాదగాహ్, మషాయిఖీన్, రాజకీయ నాయకులు , వేలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. లాల్ మస్జిద్ రోడ్ వద్ద ప్రయాణికులకు మిఠాయిలు పంచారు. రాజ్ విహార్ సెంటర్ వద్ద ర్యాలీముగిసింది. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మక్దూమ్ సాహెబ్, అహ్మద్ నక్శబంది, సయ్యద్ మహమ్మద్ ఖాద్రీ పీర్ తాహెరీ రిజ్వీ, సయ్యద్‌దాదా బాషాఖాద్రీ, కర్నూలు మేయర్ బివై.రామయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీ మోహన్ రెడ్డి, హఫీజ్ ఖాన్ , పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత, ఉస్మానియా కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ ముజమ్మిల్, కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ ప్రసంగిస్తూ మహమ్మద్ ప్రవక్త సాధించిన విజయాలు, గొప్పతనాన్ని వివరించారు. ప్రత్యేక కార్యక్రమంగా, సెంట్రల్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో అందరి సమక్షంలో లక్కీ లాటరీ డ్రాను నిర్వహించారు. ఇందులో పాల్గొన్న వారిలో ముగ్గురికి ఉమ్రా టికెట్లు, ఐదుగురు అజ్మీర్ షరీఫ్ యాత్ర టికెట్లు బహుమతులుగా అందజేశారు.

రజకులపై దాడి సరికాదు

ఎపి రజకవృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

రజకులపై దాడిని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల- సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్, న్యూ సిటీ నగర అధ్యక్ష కార్యదర్శులు సి.రాముడు, సి శేషాద్రి, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. 'శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలస మండలం కొత్తవలస గ్రామంలో అరసవల్లి హరమ్మ 60పై మరో ముగ్గురు ఆమె కుటుంబ సభ్యులపై వినాయక సవితి ఉత్సవాల సందర్భంగా పాత కక్షలు మనసులో పెట్టుకొని పెత్తందార్లు రజక కుటుంబాల పైన మారణాయుధాలతో దాడి చేయడంతో అరసవల్లి హరమ్మ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మరణించింది. మరో ముగ్గురు పురుషులకు తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రభుత్వం చెప్పిన రక్షణ చట్టం 8మంది మంత్రులతో సబ్ కమిటీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇంకా ఇలాంటి ఘటనలు రాష్ట్రంలో ఎన్ని జరిగితే ఏర్పాటు చేస్తారో చెప్పాలన్నారు. చేశారు.

అంగన్వాడీలు పోరాటాలకు సిద్ధం కావాలి

ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి-గూడూరు

అంగన్వాడి కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.నిర్మల అన్నారు. కోడుమూరు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ మహాసభ గూడూరు లోని వాసవి కళ్యాణ మండపంలో యూనియన్ నాయకులు అనంతమ్మ, సుజాత, రత్నమ్మ, సూలమ్మల అధ్యక్షతన నిర్వహించారు. పి.నిర్మల మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో దాదాపు రెండు 42 రోజులపాటు అంగన్వాడి కార్మికులు సమ్మె చేసిన నాటి అప్పటి సిఎం జగన్మోహన్ రెడ్డి కనీసం హామీలు కూడా ఇవ్వలేకపోయాడన్నారు. సమ్మె సందర్భంగా ప్రస్తుత కూటమి నాయకులు అంగన్వాడీల సమ్మె శిబిరాల దగ్గరకు వచ్చి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలు పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారని, కూటమి ప్రభావం అధికారంలోకి వచ్చి 16 నెలలు దాటుతున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించలేకపోవడం సిగ్గుచేటన్నారు. సమస్యలు పరిష్కరించకపోగా అంగన్వాడీలను రకరకాల యాప్లను తెచ్చి పనిభారాన్ని పెంచిందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఐసిడిఎస్‌కు నిధులు ఇవ్వకుండా చేతులు దులుపుకున్నదన్నారు. అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీ లందరూ పోరాటాలకు సిద్ధం కావాలని ఆమె కోరారు. అనంతరం అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రేణుక, సిఐటియు గూడూరు డివిజన్ కార్యదర్శి జె. మోహన్, కోడుమూరు సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు గఫూర్మియా, జిపి ఈరన్నలు మాట్లాడారు. అనంతరం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోడుమూరు ప్రాజెక్టు నూతన కమిటీ ని మహాసభలో ఎన్నుకున్నారు. ప్రాజెక్టు అధ్యక్షురాలుగా గూడూరు బి,సుజాత, కార్యదర్శిగా కోడుమూరు సులమ్మ, ఉపాధ్యక్షురాలుగా రేణుక, వరలక్ష్మి, అరుణ, సహాయ కార్యదర్శిగా మహేశ్వరి, రత్నమ్మ, అరుణ, కోశాధికారిగా ఇందుమతి, లతోపాటు 25 మందితో ప్రాజెక్టు కమిటీని మహాసభలో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంగన్వాడీ కార్మికులు సునంద, సుబ్బమ్మ, వరలక్ష్మి, మేరీ, కృష్ణవేణి, భాగ్య, నాగేశ్వరమ్మ, ఎల్లమ్మ, మరియు గూడూరు, బెలగల్, కోడుమూరు, కర్నూల్ మండలాల నుండి అంగన్వాడి కార్మికులు పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుత్ను గౌరవాధ్యక్షులు పి.నిర్మల

ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా 6న నిరసన

సిపిఎం, సిపిఐ పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అమెరికా అధ్యక్షుడు ట్రంపు విధిస్తున్న టారిఫ్‌లకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 6న శనివారం అన్ని పట్టణ మండల కేంద్రంలో జరిగే నిరసన కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొనాలని సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తనకిష్టం వచ్చినట్లు టారిఫ్‌లు పెంచుతూ పోతుంటే మన భారత ప్రధాని నిమ్మకు నీరెత్తుతున్నట్లు ఉంటున్నారని విమర్శించారు. తామే నిజమైన దేశభక్తులని గగ్గోలు పెట్టే బిజెపి పరివారం భారతదేశ ప్రజలపై రైతులపై భారాలేస్తుంటే ఒక్క మాట కూడా మాట్లాడకుండా ఉండడంలో అర్థం ఏంటని తెలిపారు. ప్రత్యేకించి ఆంధ్ర రాష్ట్రంలో ఆక్వా రైతులకు ట్రంప్ విధించిన టారిఫ్లతోచాలా నష్టం జరుగుతుందని ఆయన మన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు. అందువల్ల వామపక్ష పార్టీలు ట్రంపుభారత దేశంపై వేస్తున్న టారీఫ్‌లకు వ్యతిరేకంగా సెప్టెంబర్ 6న అన్ని ప్రాంతాల్లో నిరసనలు తెలపాలన్నారు. అందులో భాగంగా కర్నూలు జిల్లాలో కూడా అన్ని పట్టణ మండల కేంద్రాల్లో ఈ నిరసన కార్యక్రమం చేస్తున్నామని వారు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములయి జయప్రదం చేయాలని వారు కోరారు.

ఆదర్శ విద్యావంతులుగా తీర్చిదిద్దాలి

- ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు
- ప్రజాశక్తి నిర్వహించినటీచర్స్ డే వేడుకల్లో డిఇఒ శామ్యూల్ పాల్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని, విద్యార్థులను ఆదర్శ విద్యా వంతులను తీర్చిదిద్దాలని డిఇఒ శామ్యూల్ పాల్ పేర్కొన్నారు. కర్నూలు లలిత కళా సమితిలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డుతో సన్మానించారు. డిఇఒ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు చేసిన కృషి చాలా విలువైనదని అన్నారు. ఇప్పుడు పాఠశాలలో మనం నాటే విత్తనాలు కొన్ని సంవత్సరాల తర్వాత మనకు ఫలితాల రూపంలో కనిపిస్తాయన్నారు. విద్యార్థులు ఉత్తమ స్థానాల్లో మనకు కనిపించినప్పుడు అదే ఒక పెద్ద గర్వకారణమని తెలిపారు. అవార్డు పొందిన ఉపాధ్యాయులు మరింత కృషితో ఆదర్శ విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. ఆర్ఐఒ లాలప్ప మాట్లాడుతూ ఈ అవార్డులు ఉపాధ్యాయులపై మరింత బాధ్యతను నింపాయని గుర్తు చేశారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్‌భాను మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయుల ముందు పలు సవాళ్లు ఉన్నాయని ఆ ఆ సవాళ్లను ఛేదించి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ అవార్డులు పొందిన ప్రతి ఒక్కరు ఉత్తమ విద్యా బోధనతో మరింత ముందుకు సాగాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె. సురేష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉపాధ్యాయులకు నాన్ టీచింగ్ పనులు ఎక్కువయ్యాయని, ఉపాధ్యాయుల హోదా తగ్గిపోతోందని తెలిపారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందని, విద్యను ప్రైవేటుకు ధారాధత్తం చేయాలని చూస్తోందన్నారు. అందులో భాగంగానే విద్యార్థుల సంఖ్య తగ్గితే ఉపాధ్యాయులను తగ్గించేసి పాఠశాలలు మూసేయచ్చని చూస్తోందని అన్నారు. వృత్తిలో ముందుకు సాగుతూనే ప్రభుత్వ విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ మాట్లాడుతూ ప్రజాశక్తి ఉద్యోగుల పక్షాన ఎప్పుడూ నిలబడుతుందని తెలిపారు. గతంలో ఉద్యోగుల పిఆర్‌సి పోరాటంలో ప్రత్యేక సంచికలు వేసి ఉద్యమానికి చేయూతనిచ్చిందని తెలిపారు. విద్య ఒక ఆస్తిఅని ఆ విద్యను బలోపేతం చేసుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు మాట్లాడుతూ డిఇఒ శామ్యూల్ పాల్ డాక్టర్ కావాల్సినవారు ప్రస్తుతం ఎంతోమంది వైద్యులను తీర్చిదిద్దుతున్నారని అన్నారు. కర్నూలు డివిజన్ ఇంచార్జ్ ఎం.రాజు అధ్యక్షత వహించగా ప్రజాశక్తి విలేకరి డి చంద్రమోహన్ వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో బి.క్యాంప్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నాగస్వామి నాయక్, ఉస్మానియా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సమీవుద్దీన్, ప్రజాశక్తి ఎడిషన్ కమిటీ సభ్యులు ఎల్లా గౌడ్, వినయ్ కుమార్, సిబ్బంది మధు, రాకేష్, విలేకరులు యూసుఫ్‌ఖాన్, మునిస్వామి, సత్యం పాల్గొన్నారు.



సన్మానించిన ఉపాధ్యాయులతో డిఇఒ శామ్యూల్‌పాల్, ఆర్ఐఒ



డిఇఒతో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు



ప్రతిభ కోచింగ్ సెంటర్ అధినేత అరుణాచల రెడ్డిని సన్మానిస్తున్న డిఇఒ శామ్యూల్‌పాల్, ఆర్ఐఒ లాలయ్య, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహా తదితరులు

ఎమ్మెల్యే గుమ్మనూరును బర్తరఫ్ చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను బర్తరఫ్ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి గోవిందు మాట్లాడారు. అనంతపురం జిల్లా గుత్తి మండలం బేతపల్లి గ్రామంలో సోలార్ పరిశ్రమకు సేకరించిన భూముల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పర్యటిస్తున్న రైతుసంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ రెడ్డికి గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఫోన్ చేసి దూషించడం దుర్మార్గమని విమర్శించారు. వెంటనే క్షమాపణ చెప్పి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం నాయకులు అబ్బుల్లా, సురేష్, రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ
- దినసరి టమోటా, కూరగాయల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆస్పరి

రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, టిడిపి రాష్ట్ర మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి, టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జి వైకుంఠం శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో దినసరి టమోటా, కూరగాయల మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బిల్లేకల్లు మార్కెట్ చుట్టుపక్కల గ్రామాలకు అనువుగా ఉందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కాంట్రాక్టర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాయంత్రం త్వరగా మార్కెట్ సవాలు పెట్టి రైతులు సకాలంలో ఇంటికి చేరేలా, వ్యాపారులకు కూడా సరుకులు సకాలంలో వివిధ ప్రాంతాలకు చేరే విధంగా చూడాలని తెలిపారు. ముందుగా వారికి బాణసంచా కాలుస్తూ.. శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. నూతన కాంట్రాక్టర్ బాల తిక్కయ్య, మాజీ ఎంపిపి వెంకటేష్, సొసైటీ మాజీ డైరెక్టర్ కృష్ణ, ఎంపిటిసి నరసప్ప, మాజీ సర్పంచి సంజప్ప, జనసేన మండల కన్వీనర్ అరవింద్, నాయకులు నర్సిరెడ్డి, శేషిరెడ్డి, రామాంజనేయులు, లక్ష్మన్న, చిట్టి, కృష్ణ, శ్రీనివాసులు, వీరేష్, రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.


మార్కెట్‌ను ప్రారంభిస్తున్న బొజ్జమ్మ

నిర్మాణం నాణ్యతగా చేపట్టాలి

- శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు

ప్రజాశక్తి - మంత్రాలయం

భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న 200 గదుల సముదాయ పనులను నాణ్యతగా చేపట్టాలని శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుబుధేంద్రతీర్థులు కాంట్రాక్టర్ శ్రీనివాసులురెడ్డిని ఆదేశించారు. స్థానిక శ్రీసుయతీంద్ర తీర్థ 200 గదుల సముదాయంపై మరో 200 గదుల సముదాయం నిర్మించేందుకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం వచ్చిన భక్తులకు వసతి సౌకర్యం కల్పించేందుకు భక్తుల విరాళాలతో గదుల సముదాయ నిర్మాణానికి శంకుస్థాపన చేశామని తెలిపారు. బహిరంగ పేపర్ ప్రకటన ద్వారా టెండరును ఆహ్వానించిన నేపథ్యంలో రహస్య టెండర్‌లో రూ.12.5 కోట్లకు కర్నూలుకు చెందిన శ్రీనివాసులురెడ్డి దక్కించుకున్నారని చెప్పారు. సంస్కృత పండితులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండితకేసరి మహా మహోపాధ్యాయ బిరుదాంకితులు రాజా ఎస్.గిరియాచార్యులు, కర్ణాటక హైకోర్టు జడ్జీలు ఉమాదేవి, నదాఫ్, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, పిఆర్‌ఒ బద్రినాథ్, ఇన్‌ఛార్జి నాగరాజు పాల్గొన్నారు.

'10న ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి మహాసభ'

ప్రజాశక్తి - నందవరం

ఈనెల 10న ఎమ్మిగనూరు పద్మశాలి కల్యాణ మండపంలో వీరనారి చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి మహాసభను నిర్వహిస్తున్నట్లు రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ తెలిపారు. శుక్రవారం నందవరం, సోమలగూడూర్, కనకవీడు, నాగలదిన్నె, కైరవాడి, పెద్దకొత్తిలి గ్రామాల్లో రజకులకు ఆహ్వాన పత్రికలను అందించారు. వివిధ గ్రామాల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐలమ్మ, రామకృష్ణ వర్ధంతి మహాసభకు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు. గౌరవాధ్యక్షులు దైవందిన్నె సి.హనుమంతు, ఇబ్రహీంపురం సి.ఎల్లప్ప, నందవరం సి.భీమన్న పాల్గొన్నారు.


కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మాకు న్యాయం చేయండి

- కెజిబివి ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆందోళన


ప్రజాశక్తి - నందవరం

తమకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టి న్యాయం చేయాలని నందవరం కెజిబివి ఉపాధ్యాయులు, విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. తమ పాఠశాలకు వచ్చే నీటి పైపులైన్‌కు కనెక్షన్ ఇచ్చి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇవ్వటానికి అధికారులు పూనుకున్నారని వాపోయారు. శుక్రవారం ఉపాధ్యాయులు మాట్లాడారు. విద్యార్థులు, సిబ్బంది కలిపి సుమారు 300 మంది వసతి గృహంలో ఉంటున్నాని, ప్రస్తుతం ఉదయం ఒక గంట మాత్రమే నీరు వస్తున్నాయని తెలిపారు. ఆ నీరు సరిపోవడం లేదని, ఉన్నత పాఠశాలకు తమ పైపులైన్ ద్వారా కనెక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నించడం దారుణమని మండిపడ్డారు. ప్రిన్సిపల్ శైలజ మాట్లాడుతూ... 'బాలికల వసతి గృహానికి ఇప్పటికే నీటి కొరత ఉంది. వచ్చే కొద్దిపాటి నీటికి అధికారులు అడ్డుపడడం బాధాకరం. మాకు తెలియకుండా, మా అనుమతి లేకుండా వారు పైపులైన్ వేసేందుకు ప్రయత్నించడం ఏమిట'ని ప్రశ్నించారు. కొన్ని నెలల క్రితం ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి ప్రేమ్ కుమార్ అధికారులను, నాయకులను ఒప్పించి విద్యార్థులకు నీరందించారని, ప్రస్తుత అధికారి ఆ విద్యార్థులకు తీరని అన్యాయం చేయడానికి పూనుకోవడం బాధాకరమని తెలిపారు. ఆ పైపులైన్‌కు కనెక్షన్ ఇస్తే తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల ద్వారా నిరసనలు చేపడతామని విద్యార్థులు హెచ్చరించారు.


సమస్యను చూపుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి దురుసు ప్రవర్తన

- విద్యా కమిటీ చైర్మన్ భీమన్న



నీటిని సరఫరా చేయడానికి పైపు లైన్ కెజిబివి దగ్గరకు తీసుకొచ్చారు. ఫోన్ చేసి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి బాలకృష్ణను అడగగా... మీకెందుకు చెప్పాలా, 'ఎక్కడ కనెక్షన్లు ఇవ్వాలో నువ్వు నాకు చెప్పడం ఏమిట'ని ఆయన చిందులేశారు. 'మీ పాఠశాలకు నీరు వస్తాయా రావా అన్నది చూడాలా. అంతే తప్ప అక్కడ తీసుకోరాదు. ఇక్కడ తీసుకోరాదు. అని చెప్పే అధికారం మీకు లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కష్టపడి పైప్ లైన్ వేయించాను. ఇక్కడ కనెక్షన్లు ఇవ్వొద్దనే అధికారం కూడా మాకు లేదా. మా పైప్ లైన్ దగ్గర కనెక్షన్లు ఇవ్వకుండా 50 మీటర్ల దగ్గరలో ఉన్న మెయిన్ లైన్ ద్వారా కనెక్షన్లు ఇప్పించి, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలి.

నీటి సమస్యతో కష్టాలు ఎదుర్కొన్నాం

- పి.అర్చన, 10వ తరగతి విద్యార్థిని




పాఠశాలలో చేరినప్పటి నుంచి ఇప్పటి వరకు నీటి సమస్యలతో కష్టాలను ఎదుర్కొన్నాం. నీటి సమస్య వల్ల చాలామంది విద్యార్థులు పాఠశాల వదిలిపెట్టారు. విద్యా కమిటీ ఛైర్మన్ పోరాటం చేసి పైపు లైన్ వేయించి నీటి సమస్యను తీర్చారు. ఆ సమస్యను పునరావృతం చేసేందుకు అధికారుల ప్రయత్నించడం బాధాకరం. మా కష్టాలు తిరిగి మొదలయ్యే విధంగా ఉన్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

విద్యార్థుల భవిష్యత్తుకు స్ఫూర్తి దాతలు : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఆలూరు

సమాజంలో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే స్ఫూర్తి దాతలు ఉపాధ్యాయులని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, ఉపాధ్యాయులు ఖాసీం తెలిపారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా మండల ఎంఆర్‌సి ఆవరణలో యుటిఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఈరన్న, సుబ్బారెడ్డి, మంజుల, జంబులింగయ్య, బసప్ప, రామకృష్ణా రెడ్డి, గోవిందప్పను శాలువా, పూలమాలాలతో సన్మానించారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సురేష్ బాబు, రూపలత, రాధమ్మ, సుధాకర్, షేక్షరావు, మంగయ్య, వహీద, హేమలత, మధు, మల్లికార్జున, రామాంజి, సురేష్ పాల్గొన్నారు. **ఆదోని** మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున మాట్లాడారు. విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకంగా ఉంటారన్నారు. విద్యార్థులు ఇష్టంతో, ప్రణాళిక బద్ధంగా చదివి జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు రమేష్ నాయుడు, రాజా సతీష్, బసవరాజు నగేష్ ఉన్నారు. అలాగే ఎస్‌టియు ఆదోని, కౌతాళం మండల శాఖల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆదోని మండల ప్రధాన కార్యదర్శి బి.సుధాకర్ బాబు అధ్యక్షత వహించారు. ఇటీవల ప్రధానోపాధ్యాయులుగా ప్రమోషన్ పొందిన సీనియర్ ఉపాధ్యాయులు వరాహలమ్మ, అబ్దుల్ నబి, నరసింహారెడ్డి, ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు, సత్యన్నను పూలమాల, శాలువాతో సన్మానించారు. ఎస్‌టియు రాష్ట్ర అకాడమిక్ కమిటీ మెంబర్ మహాదేవప్ప, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, జిల్లా ఆర్థిక కమిటీ సభ్యులు రామాంజనేయులు, జిల్లా కౌన్సిలర్ గోపాల్, సీనియర్ నాయకులు వెంకోబా, సూర్యుడు, రవికుమార్, భాస్కర్, గణేష్ ఉన్నారు. అలాగే లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పులమాల వేసి నివాళులర్పించారు. లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ ప్రసాదరావు, అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, కోశాధికారి వనపరాజు, విశిష్ట అతిథి ఓం ప్రకాష్ పాల్గొన్నారు. **ఎమ్మిగనూరు** పట్టణంలోని రావూస్ డిగ్రీ, దీక్ష జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. రావూస్, దీక్ష కళాశాల సిఇఒ తిరుమలరెడ్డి అధ్యక్షత వహించారు. ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రావూస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, దీక్ష జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మద్దిలేటి, ప్రోగ్రామ్ ఇన్‌ఛార్జి విజయ్ కుమార్, రావూస్ కళాశాల సీనియర్ అధ్యాపకులు గోరంట్ల, వెంకటేశ్వర్లు, నరసింహులు, పాల్ రాజ్, వీరేష్, విజయరాజ్, సంపత్, శ్రుతి ప్రియా, జ్యోతి, రాణి, హరిణి, ధనుంజయ, గోవిందు, దీక్ష కళాశాల సీనియర్ అధ్యాపకులు రాజ్ కుమార్, సురేష్, శ్రీనివాస్ రెడ్డి, గౌస్, శివ, విరుపాక్షి, అంజిరెడ్డి, లింగమయ్య, రాముడు, మధుబాబు, నరసింహులు, లలిత, రమాదేవి, రాజేశ్వరి, పవిత్ర, బేగం, శోభ, జ్యోత్స్న, లక్ష్మి, ప్రీతి, శిల్ప పాల్గొన్నారు.


ఆలూరులో విశ్రాంత ప్రధానోపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు


ఆదోనిలో నివాళు లర్పిస్తున్న ఉపాధ్యాయులు


ఎమ్మిగనూరులో నివాళులర్పిస్తున్న సిబ్బంది

కార్మికులను పట్టించుకోని ప్రభుత్వాలు


- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - నందవరం

ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను పట్టించుకోవడం లేదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, మండల కార్యదర్శి రాముడు విమర్శించారు. శుక్రవారం నందవరంలో ఉరుకుందు ఆధ్వర్యంలో సిఐటియు మండల మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ సంస్థలను ప్రయివేట్ పరం చేస్తూ మోదీ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు. యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు రాకుండా నిరుద్యోగ సమస్య నెలకొందని తెలిపారు. ప్రధాని మోడీ మెప్పు కోసం బిజెపి ప్రభుత్వం విధానాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. 18 నెలలు గడిచినా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు ఏ విధమైన సంక్షేమాన్ని అమలు చేయలేదని మండిపడ్డారు.

నూతన కమిటీ ఎన్నిక : రాధాకృష్ణ ఆధ్వర్యంలో సిఐటియు మండల కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఉరుకుంద, కమిటీ సభ్యులుగా పద్మ, పుణ్యవతి, భాగ్యమ్మ, మంజుల, ఆనంద్, కోదండ, శారద, తులసమ్మ, బాష, హేమలత, లక్ష్మీదేవి ఎన్నికయ్యారు.

కోసిగి : సిఐటియు మండల మహాసభ హెప్సిబా రాణి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు హాజరయ్యారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా రాముడు, కో కన్వీనర్‌గా హెప్సిబా రాణి, వెంకటమ్మ, కమిటీ సభ్యులుగా లూసమ్మ, వరలక్ష్మి, సుజాత, వెంకటేష్, గుర్రం వీరేష్, ఈరన్న, మధుసూదన్, రామలింగను ఎన్నుకున్నారు.


నందవరంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ


కోసిగిలో మాట్లాడుతున్న అంజిబాబు

అధికారులు మరిచారు.. ప్రజలు బాగు చేసుకున్నారు..!

- గుంతలు, మురుగు నీటితో అధ్వానంగా మారిన రహదారి
- సమిష్టి కృషితో బాగు చేసుకున్న వెముగోడు ప్రజలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

వెముగోడు గ్రామంలో నుంచి పెద్దనేలటూరుకు వెళ్లే దారి పాత రహదారి. ఈ రహదారి గుండా నిత్యం వందలాది మంది ప్రజలు, రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్తుంటారు. అలాగే విద్యార్థులు పాఠశాలకు ఇదే రహదారి గుండా వెళ్తారు. దశాబ్ద కాలంగా ఈ రహదారికిరువైపులా ముళ్లకంప పెరగడంతో పాటు రహదారి మధ్యలో గుంతలు పడ్డాయి. వర్షం వచ్చినప్పుడు గుంతలో మురుగునీరు నిలిచి అధ్వానంగా తయారయింది. గుంతలు, మురుగునీరు, బురదలో వ్యవసాయ కూలీలు, రైతులు, ప్రజలతో పాటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఏ అధికారో, రాజకీయ నాయకులో ఈ రహదారిని బాగు చేయకపోతారా అని గ్రామస్తులు ఎదురుచూశారు. ఎవరూ స్పందించకపోవడంతో ఫలితం లేకపోయింది. 'ఎవరో వస్తారు. ఏదో చేస్తార'ని ఎదురు చూడకుండా ప్రజలే తలో చేయి వేసి ఈ రహదారిని బాగు చేసుకున్నారు. గ్రామానికి చెందిన ఎం.మహబూబ్ బాషా రహదారికి గ్రావెల్ వేసేందుకు అయ్యే ఖర్చును భరిస్తానని ముందుకొచ్చారు. అతనికి తోడుగా సహకారం అందించడానికి గ్రామానికి చెందిన డి.శ్రీనివాసులు, ఎం.హాజీవలీ, పి.మాబు సుభాన్, పూజారి హనుమంతు, రామలింగడు, ఎం.నజీర్ బాష, ఎస్.వలీ, ఎం.మాబాష, బి.కృష్ణ, డి.హనుమన్న, పి.వలీ, ఎస్.సుభాన్ వలీ, ఎం.రఫీ, ఎం.షేక్షావలీ, అఖిన్ బాష, మునీర్ బాష ముందుకొచ్చారు. గురువారం మధ్యాహ్నం నుంచి ఈ రోడ్డుకు మట్టితోలి గుంతలు పూడ్చి చదును చేసే ప్రక్రియను ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం నాటికి ఈ రోడ్డుకు ట్రాక్టర్లతో గ్రావెల్ తోలి బాగు చేసుకున్నారు. వందలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తొలిగాయి. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా గ్రామస్తులందరూ ఏకమై రోడ్డును బాగు చేసుకోవడం అభినందనీయం.


మట్టి తోలిన తర్వాత రోడ్డు

అందరి సహకారంతో బాగు చేసుకున్నాం

- ఎం.మహబూబ్ బాషా, వెముగోడు గ్రామం



మా గ్రామం నుంచి పెద్దనేలటూరుకు వెళ్లేందుకు ఈ రహదారి ప్రధానమైంది. ఈ దారి వర్షపు నీరు, మురుగునీటితో నిండి ఇబ్బందికరంగా తయారయింది. కొన్నేళ్లుగా ఎవరూ పట్టించుకోలేదు. రహదారిని బాగు చేసుకుంటే సుమారు 700 మంది రైతు కుటుంబాలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో రోడ్డుకు మట్టి తోలుకోవడానికి నా సొంత డబ్బు ఖర్చు చేస్తానని చెప్పాను. నాకు తోడుగా చాలామంది రైతులు, గ్రామస్తులు ముందుకొచ్చారు. వారందరి సహకారంతో మట్టిని తోలి రోడ్డును బాగు చేసుకున్నాం.


బహిరంగ సభలో మాట్లాడుతున్న నాయకులు

జిల్లా సాధన కోసం ఆమరణ దీక్షకు సిద్ధం

- ఎమ్మెల్యే పార్థసారథి - పెద్దహరివాణంలో బహిరంగ సభ

ప్రజాశక్తి - ఆదోని రూరల్

ఆదోని జిల్లాతో పాటు ఆదోని మండలాన్ని నాలుగు మండలాలుగా చేసే వరకు నిద్రపోనని, అవసరమైతే ఆమరణ దీక్షకు సిద్ధమవుతానని ఎమ్మెల్యే పార్థసారథి తెలిపారు. ప్రజల సమస్యలు తీరాలంటే ప్రత్యేక మండలం కావాల్సిందేనని చెప్పారు. శుక్రవారం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహించారు. జనసేన ఇన్‌ఛార్జి మల్లప్ప మాట్లాడుతూ... పార్థసారథి ఎమ్మెల్యే కాదని, పెద్దహరివాణం మండల సారథి అని పేరుకు నామకరణ చేశారు. జిల్లా మంత్రులే కాదు, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పని చేసే వ్యక్తి ఎమ్మెల్యే పార్థసారథి అని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడారు. గత 15 రోజులుగా మండల ఏర్పాటు కోసం ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసి పడుతోందని తెలిపారు. ఆదోని మండల ప్రజలు పొట్ట చేతపట్టుకొని వలసలు వెళ్తుంటే బాధగా ఉందని చెప్పారు. అసెంబ్లీలో మొట్టమొదటి రోజు ఆదోనిని నాలుగు మండలాలుగా చేయాలని మాట్లాడితే అందరూ వెనక్కి తిరిగి చూశారని, తనకు నాలుగంటే నాలుగు మండలాలు కావాలని చెప్పానని అన్నారు. ఆదినారాయణ రెడ్డి, సర్పంచి రాము, కురువ, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి సీనియర్ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మి సలీం, మాజీ ఎంపిపి పంపావతి, 13 గ్రామాల నుంచి ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నూర్ అహ్మద్

ఆదోని జిల్లా సాధనకు మద్దతు ఇవ్వాలి

- సమితి వ్యవస్థాపకులు నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని


ఆదోని జిల్లా సాధన పోరులో ఉపాధ్యాయులు కలిసి రావాలని ఆదోని జిల్లా సాధన సమితి వ్యవస్థాపకులు నూర్ అహ్మద్ కోరారు. శుక్రవారం ఎస్‌టియు నాయకత్వంలో వెంకన్న పేట పురపాలక ప్రాథమిక పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులు నాగేంద్రప్ప అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. నూర్ అహ్మద్ అతిథిగా పాల్గొని మాట్లాడారు. భావితరాలు, యువత, ఆదోని భవిష్యత్తు కోసం జిల్లా సాధనకు కలిసిరావాలని కోరారు. విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించి, వారి శేషజీవితం సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా గడపాలని ఆకాంక్షించారు. జిల్లా సమితి నాయకులు నరేంద్ర యాదవ్, నాగరాజు, హఫీజ్ ఉన్నారు.


ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు


ప్రజాశక్తి - విలేకరులు

ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులు అవార్డులు అందుకున్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలో కలెక్టర్ రంజిత్ బాష, ఎంపీ బస్తిపాటి నాగరాజు, డిఇఒ శ్యాముల్ పాల్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

మంత్రాలయం మండలం మాధవరం గ్రామంలోని ప్రధాన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామమోహన్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కర్నూలు నగరంలో కలెక్టర్ రంజిత్ బాషా, ఎంపీ బస్తిపాటి నాగరాజు శాలువా, పూల మాల వేసి ఉత్తమ సేవాపత్రం అందజేశారు. రామమోహన్ మాట్లాడుతూ... విధి నిర్వహణలో బాధ్యతతో సేవలందించిన తాను ఉత్తమ అవార్డు అందుకోవడం గర్వంగా ఉందని తెలిపారు. డిఇఒ శ్యామ్యుల్ పాల్, ఎంఇఒలు మొయినుద్దీన్, రాఘన్నకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మంత్రాలయం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి వ్యాయామ ఉపాధ్యాయులు వి.నరసింహ రాజు స్పోర్ట్స్ ఎక్సలెంట్ అవార్డు అందుకున్నారు. పాఠశాలలో క్రీడాకారులకు అవసరమైన క్రీడా సామగ్రి, దుస్తులు అందజేసి ప్రోత్సహించిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డికి, టిడిపి ఇన్‌ఛార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డికి, మంచాల సొసైటీ ఛైర్మన్ ఎన్.రామకృష్ణారెడ్డి, ఎస్ఐ శివాంజల్, జనసేన ఇన్‌ఛార్జి బి.లక్ష్మన్న, టిడిపి పట్టణ ఇన్‌ఛార్జి బి.వరదరాజులు, ఎంపిటిసి మేకల వెంకటేష్, మంచాల సొసైటీ డైరెక్టర్ డిసి.తిమ్మప్పకు కృతజ్ఞతలు తెలిపారు. **చిప్పగిరి** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న రంగనాయకులు ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ... ఉత్తమ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. రంగనాయకులకు తోటి ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందన లు తెలిపారు. **ఆదోని** మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ హైస్కూల్ ఉపాధ్యాయులు సునీల్ రాజ్ కుమార్ అవార్డు అందుకున్నారు. పట్టణంలోని కిలిచిన పేట పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తూ బడి బయట ఉన్న పిల్లలను చేర్పించి వారికి చదువుకునే అవకాశం కల్పించామని తెలిపారు. తన సేవలను గుర్తించి ప్రభుత్వం మెడల్, జ్ఞాపిక అందజేసిందని చెప్పారు.


మంత్రాలయం రామమోహన్


నరసింహ రాజు


చిప్పగిరి రంగనాయకులు


ఆదోని సునీల్ రాజ్ కుమార్

రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలో వెలసిన శ్రీఆది చింతలముని నల్లారెడ్డి స్వామి దశమి మహోత్సవం సందర్భంగా గోనెగండ్ల ట్రాక్టర్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు ట్రాక్టర్ యూనియన్ నాయకులు కె.ఉసేన్, గానిగ రహంతుల్లా, శివన్న, డి.నూర్, గోపాల్, వెంకటేష్, మాబు, భాస్కర్ తెలిపారు. శుక్రవారం పోటీల గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దశమి మహోత్సవం సందర్భంగా ఈ నెల 13, 14, 15వ తేదీల్లో ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి హాజరయి పోటీలు ప్రారంభిస్తారని చెప్పారు. 13న 4 పళ్ల సైజ్ పోటీలు మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు, ఆరో బహుమతి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. 14న 6 పళ్ల సైజ్ పోటీలు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.20 వేలు, నాలుగో బహుమతి రూ.10 వేలు, ఐదో బహుమతి రూ.5 వేలు, ఆరో బహుమతి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. 15న న్యూ కేటగిరి పోటీలు మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బహుమతి రూ.30 వేలు, నాలుగో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహుమతి రూ.5 వేలు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రవేశ రుసుం రూ.700 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9949151807, 8522014358 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.



గోడపత్రికలు విడుదల చేస్తున్న ట్రాక్టర్ యూనియన్ నాయకులు

బ్యాంకింగ్ సేవలో నాగరాజుకు అవార్డు

ప్రజాశక్తి - ఆదోని

బ్యాంకుకు వస్తున్న ఖాతాదారులకు ఉత్తమ సేవలందించడంలో ప్రతిభ కనబరిచి ఇండియాలోనే టాప్-2గా నిలిచిన కెనరా బ్యాంకు ఉద్యోగి నాగరాజుకు ప్రశంస, అవార్డు దక్కింది. ఉన్నతాధికారుల చేతులమీదుగా నాగరాజు ప్రశంస అందుకున్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. తాను పట్టణంలోని కెనరా బ్యాంకులో పని చేస్తూ వినియోగదారులకు ఉత్తమ సేవలందించడంలో బ్యాంకింగ్ రంగంలో రెండో వ్యక్తిగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. కెనరా బ్యాంక్ హెడ్ ఆఫీసు నుంచి తనకు రూ.10 వేల నగదు, షీల్డ్ అందించి ప్రశంసించారని చెప్పారు. కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్ నాగరాజును శాలువా వేసి సన్మానించారు. హెడ్ ఆఫీస్ నుంచి (సిఇఒ, సిఎమ్‌డి) మేనేజింగ్ డైరెక్టర్ కె.సత్యనారాయణరాజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాగరాజును అభినందించారు. నాగరాజును ఆదోని కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ రాజేష్, రాజు మోహన్, మేనేజర్ సురేంద్రబాబు అభినందించారు.



ప్రశంస అందుకున్న నాగరాజు

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

మిలాద్ ఉన్ నబి పండగ సందర్భంగా శుక్రవారం ఆదోనిలో ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. తిక్క స్వామి దర్గా, కంట్రోల్ రూమ్, చిన్న మార్కెట్ మీదుగా పెద్ద మసీదు చేరుకొని అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బార్‌పేట్‌లో ప్రవక్త తలనీలాలు బడేసాబ్ షరీఫ్‌ను కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ దర్శించుకున్నారు. ఆదోనిలో మహ్మద్ ప్రవక్త తలనీలాలను టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు దర్శించుకున్నారు. **కౌతాళం** మక్కా మదీనా ప్రతిమలతో కౌతాళం, కుంటనహాల్, నదిచాగి ఆయా గ్రామాల్లో ఊరేగింపు చేపట్టారు. శ్రీజగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గా పీఠాధిపతులు మున్న పాషా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. దర్గాలో మక్కా మదీనా ప్రతిమలను, అసర్ ముబారక్ కార్యక్రమం నిర్వహించారు. కౌతాళంలో గ్రామ ప్రముఖులు ఖాదర్ బాషా, ఖురేషి మహబూబ్, ఖురేషి అట్టం, రషీద్, హుస్సేన్ ఖాసీం పాల్గొన్నారు. కుంటనహాళ్ గ్రామంలో జమియా మసీద్ ముతవల్లి ఆలం బాష,హోటల్ రోషన్, కటిక మన్సూర్, హుస్సేన్ బాష, అస్మత్ వలీ, దిల్దార్, బోరాల ఖలీల్, రియాజ్, దుబ్బవలీ సుభాన్, మాబు సుభాని పాల్గొన్నారు. **కోసిగి** మండలంలో ఉన్న ముస్లింలు మిలాద్ ఉన్ నబీ వేడుకలను ఘనంగా నిర్వహించా రు. మసీదులను విద్యుద్దీపాలతో, జెండాలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో పెద్ద జెండాతో పురవీధుల గుండా తిరుగుతూ ప్రదర్శన చేపట్టారు. మసీదుల్లో అన్నదానం నిర్వహించారు. గోకర్ సాబ్ జెండా వద్ద సర్పంచి అయ్యమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయించారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **మంత్రాలయం** జామీయ మసీదు నుంచి రాఘవేంద్ర సర్కిల్ మీదుగా ఈద్గా వరకు భారీ ర్యాలీ నిర్వహించి, అక్కడి నుంచి మసీదు చేరుకుని తలనీలాల ప్రదర్శన చేపట్టారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఇమాం ఖాజా బందేనవాజ్, జామీయ మసీదు కమిటీ పెద్దలు ముతవల్లి బాష, ఖాజా హుస్సేన్ తాత, పింగాణి ఖాజా, బేల్దారు మాబాష, చోటే బాష, యూత్ కమిటీ సభ్యులు సాబువలీ, అండే బాష, అక్బర్ వలీ, చంద్ బాష, రఫిక్, గని, గన్నీద్, ఖాజా ఉన్నారు. సిఐ రామాంజులు ఆధ్వర్యంలో మంత్రాలయం ఎస్ఐ శివాంజుల్, మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.



ఆదోనిలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



కౌతాళంలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



ఆదోనిలో తలనీలాలను దర్శించుకుంటున్న ఉమాపతి నాయుడు



కోసిగిలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లింలు



ఆర్థిక సాయం అందిస్తున్న ప్రసన్న రాజు

చదువుకు పేదరికం అడ్డుకాకూడదు

- చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రసన్న రాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చదువుకు పేదరికం అడ్డుకాకూడదని చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రసన్న రాజు తెలిపారు. పట్టణానికి చెందిన రాజేష్, సుగుణమ్మ దంపతుల కుమార్తె క్రాంతి ఈ ఏడాది జరిగిన నీట్ ఎంట్రెన్స్ పరీక్షలో ఉత్తమ మార్కులు సాధించారు. నెల్లూరు నారాయణ కళాశాలలో మెడికల్ సీట్ సాధించినందుకు చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థిని అభినందించి చేయూతగా రూ.35 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుల్లో బాగా రాణిస్తున్న పేద విద్యార్థులకు తమ సంస్థ తోడ్పాటునందిస్తోందని తెలిపారు. చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మాదన్న, ప్రకాష్, రంగస్వామి, సుధాకర్, రాజు, సంజన్న, శ్రీనివాసులు పాల్గొని తల్లిదండ్రులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి సమీపంలో గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఆలూరుకు చెందిన కటికె అక్బర్ (34) మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు... ఆలూరుకు చెందిన కటికె అక్బర్ గుంతకల్లుకు పోయి పనులు ముగించుకొని సొంత ఊరు ఆలూరుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి సమీపంలో చిప్పగిరికి చెందిన ఇబ్రహీం ద్విచక్ర వాహనంపై ఆలూరు నుంచి చిప్పగిరికి వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. చిప్పగిరికి చెందిన ఇబ్రహీంకు స్వల్ప గాయాలు కాగా, అక్బర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఆలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. బైక్‌లపై వెనక ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాయ్యాయి. మృతుడు అక్బర్‌కు భార్య, ఒక కుమార్తె ఉండగా.. భార్య గర్భిణీగా ఉన్నట్లు ఆయన బంధువులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీమఠానికి రూ.40 లక్షల కారు విరాళం

ప్రజాశక్తి - మంత్రాలయం

శ్రీమఠానికి ఎస్‌బిఐ వారు రూ.40 లక్షల విలువ గల ఇన్నోవా క్రిస్టా కారును విరాళంగా అందజేశారు. రిబ్బన్ కట్ చేసి ఎస్‌బిఐ సిజిఎం రాజేష్ కుమార్ పాటిల్ చేతుల మీదుగా కారు తాళం అందజేశారు. శుక్రవారం స్థానిక శ్రీమఠం ఆవరణలోని యోగీంద్ర సభామండపం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు మాట్లాడారు. 1970 నుంచి ఎస్‌బిఐ సేవలు అందుతున్నాయని చెప్పారు. శ్రీమఠం నుంచి ఎస్‌బిఐకి సహకరిస్తున్నామని తెలిపారు. మరో రూ.1.5 కోట్లు డిపాజిట్ చేస్తామని పేర్కొన్నారు. డిజిఎం హేమ, జిఎం అమరేంద్ర కుమార్, సుమన్, బిఎం రాజశేఖర్, ఫీల్డ్ ఆఫీసర్ రామచంద్ర నాయక్, అకౌంటెంట్ నరేంద్ర కుమార్, శ్రీమఠం ఎఎఒ మాధవ శెట్టి, మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు, ఈఈ సురేష్ కోనాపూర్ పాల్గొన్నారు.



పీఠాధిపతులకు కారును అందజేస్తున్న ఎస్‌బిఐ సిజిఎం రాజేష్ కుమార్ పాటిల్



ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్న ఆర్‌యువి వెంకటబసవరావు, అధ్యాపకులు

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పది

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ఉపాధ్యాయవృత్తి ఎంతో గొప్పదని వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం రాయలసీమ విశ్వవిద్యాలయం విసి. కాన్ఫరెన్స్ హాలులో సర్వేపల్లివారి చిత్రపటానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. రాయలసీమ విశ్వవిద్యాలయం అభివృద్ధిలో అధ్యాపకులు అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. వర్సిటీ రెక్టార్ ఎన్‌టికె. నాయక్, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు, వర్సటీ కళాశాల ప్రిన్సిపల్ సివి.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జాతీ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాతీ నిర్మాణంలో అధ్యాపకులు అందరూ భాగస్వామ్యం కావాలని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. మహబూబ్ బాషా పేర్కొన్నారు. శుక్రవారం కర్నూలు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపతానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను కొనియాడారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ పాల్ కృపాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎస్ఎం హుస్సేని, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

ఈ నెల 13న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. రాజీకి అర్హమైన సివిల్ క్రిమినల్ తగాదాలకు సంబంధించిన ముందస్తు బెంచులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు.



ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నేత ఆంధ్రయ్య

సుధీర్ఘ పోరాటంలో అనేక విజయాలు

ఎమ్మార్పీఎస్ నేత ఆంధ్రయ్య

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామంలో మాదిగ రిజెర్వేషన్ పోరాట సమితి జెండావిష్కరణ గ్రామ ఎంఆర్‌పిఎస్ ప్రెసిడెంట్ మల్లెపోగు లాలు ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు ఆంధ్రయ్య జెండాను ఎగురవేశారు. ఆంధ్రయ్య, మాట్లాడుతూ, మహాజననేత, ఉద్యమాల పులిబిడ్డ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం కోడుమూరు మండలం కృష్ణాపురం గ్రామంలో జెండావిష్కరణ చేశామన్నారు. బోధించు సమీకరించు పోరాడు అనేటటువంటి లక్ష్యంతో 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎంతోమంది బలిదానాలు, ఆత్మహత్యలు నిర్బంధాల నడుమ ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నామన్నారు. సామాజిక సేవలో భాగంగా వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు పింఛన్లు సాధించుకోవడంలో ఎంఆర్‌పిఎస్ కీలక బాధ్యత వహించిందని అన్నారు. కష్ణాపురం గ్రామంలోని ఉద్యోగస్తులు, పెద్దలకు, మహిళలకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఎఫ్ నాయకులు ఎల్లప్ప, మద్దిలేటి, సుధాకర్, వెలుగు ఎల్లప్ప,ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు లక్ష్మన్న, కట్టెల రాజు, రత్నం, కోడుమూరు ఎంఆర్‌పిఎస్ పట్టణ అధ్యక్షులు బిసి. రాజు, ఉపాధ్యక్షులు రాము, విద్యార్థి నాయకులు కృష్ణాపురం గ్రామ పెద్దలు, మహిళలు యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మార్క్సిజమే ప్రగతిశీలకవులకు మూలవస్తువు

ప్రముఖకవి జి.వెంకట కష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ప్రగతిశీలకవులకు మార్క్సిజమే మూల వస్తువుగా ఉంటుందని ఏది రాసినా సామాన్యుల, బడుగు బలహీన వర్గాల దృష్టి కోణంలోనే చూస్తారని ప్రముఖ కవి జి వెంకటకృష్ణ అన్నారు. శుక్రవారం కర్నూలు యుటిఎఫ్ కార్యాలయంలో సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సాహిత్య సమాలోచన పై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జంధ్యాల రఘుబాబు రాసిన ఐదు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. సభాధ్యక్షులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ వ్యవహరించారు. ఆవిష్కర్త మాట్లాడుతూ జంధ్యాల రఘుబాబు కవిత్వం కథ పాట విమర్శ రాయడం అరుదైన విషయమని ఇన్ని ప్రక్రియల్లో ప్రతిభ సంపాదించడం సామాన్య విషయం కాదని అవన్నీ కూడా సామాజిక చైతన్య రూపాలని వాటిని మార్క్సిజం దృష్టి కోణం నుంచి రాయడం గొప్ప విషయమన్నారు. జంధ్యాల రఘుబాబు రాసిన పెట్టుడు రెక్కలు కథా సంపుటిపై రాయలసీమ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ మాట్లాడుతూ సున్నితమైన అంశాలు కథల్లో ఘాడమైన వస్తువులుగా మారాయని ఆ రెండు గంటలు, టూలెట్ కథలు సాహిత్య చరిత్రలో మైలురాళ్లని అన్నారు. నెర్రెలు కవిత్వం గురించి విరసం నాయకులు డాక్టర్ నాగేశ్వరాచారి మాట్లాడుతూ రాయలసీమ అస్తిత్వాన్ని ప్రతిపాదించే కవిత్వం నెర్రెలని రచయిత భౌగోళిక కోణం నుండి కాకుండా సామాజిక కోణం నుంచి రాశారని ఈ కవీనా సామాజిక అంశాలు మాట్లాడాలని అలా మాట్లాడడమే సమాజం కోరుకుంటుందని అన్నారు. జంధ్యాల రఘుబాబు రాసిన అక్షర కాంతులు విమర్శ గ్రంథం గూర్చి కెంగార మోహన్ మాట్లాడుతూ విమర్శలో పదునైన ఆయుధంగా రఘుబాబు నిలిచారని కవిని గూర్చి అతను రాసిన రచన గూర్చి ఏ దృక్పథంతో రాశారో ఏ కోణంలో ఆలోచిస్తున్నారో సమగ్ర స్వరూపంగా అక్షర కాంతులు వెలువడిందని అన్నారు. సాహిత్య లోకంలో అరుదైన విమర్శ గ్రంథం అని వివరించారు. అద్దంలో బొమ్మలు కథల సంపత్ గురించి సాహితీ స్రవంతి సీనియర్ నాయకులు నాగమణి మాట్లాడుతూ ఈ కథల్లో మానవీయ స్పర్శ నైతిక మానవత విలువల పతనం అద్భుతంగా ఉందని పాత్రల్ని అద్భుతంగా సృష్టించారని పాత్రలకు జీవం పోశారని అన్నారు. వాస్తవమైన కథలను కథా వస్తువులుగా ఎంచుకోవడంలోనే జంధ్యాల రఘుబాబు సఫలమయ్యారని అన్నారు. సైరా మా బళ్లారి పాటల గూర్చి సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్ మాట్లాడుతూ ఈ సంపుటిలోని పాటలు ప్రజాపాటలుగా ప్రజా చైతన్యానికి పునాదులు వేస్తాయని సమకాలీన సమస్యల్ని పాటలు గా రాయడం సమకాలీన వ్యక్తుల్ని పాటలుగా మార్చడం సామాజిక సమస్యలే ధ్యేయంగా పాటల అల్లిక జరిగిందని అన్నారు. ఈ పాటలు సాహిత్య చరిత్రలో నూతన అధ్యాయమని అన్నారు. అనంతరం రఘుబాబు స్పందిస్తూ మంచి అధ్యయనమే మంచి రచయితను తీర్చిదిద్దుతుందని సమాజాన్ని పురోగమిశగా తీసుకెళ్తుందని తన సాహిత్యం లోతైన చర్చకు మార్గం చూపిందని అన్నారు. అనంతరం రచయిత జంధ్యాల రఘు బాబును సాహితీ స్రవంతి జిల్లా కమిటీ ఘనంగా సత్కరించింది. సభను సాహితీ స్రవంతి జిల్లా నాయకులు మధు బాలగౌని ప్రారంభించగా సభలో ప్రముఖ కథా రచయితలు మారుతీ పౌరోహితం, డాక్టర్ పేరం ఇందిరా దేవి సాహితీ స్రవంతి జిల్లా నాయకులు విజయులుతనగల హాజరయ్యారు.



జంధ్యాల రఘుబాబు రచించిన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న జి.వెంకటకృష్ణ , తదితరులు

ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి శుక్రవారం తన స్వగహంలో గ్రీవెన్స్ ప్రోగ్రాం నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు ఎమ్మెల్యేకు నేరుగా తెలిపారు. ప్రతి ఒక్కరి ఫిర్యాదును శ్రద్ధగా విని, వెంటనే సంబంధిత అధికారులకు పరిష్కార చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలతో నిత్యం మమేకమై, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజల సమస్యలు పరిష్కరించడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వివిధ గ్రామాల ప్రజలు సమస్యలు వివరించారు.



కౌలు రైతులు కు గుర్తింపు కార్డులివ్వాలి

ప్రజాశక్తి-పత్తికొండ రూరల్



రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ఆంధ్ర ప్రదేశ్ కౌలు రైతు సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి కె.తిమ్మయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పత్తికొండ మండలంలోని నలక దొడ్డి గ్రామంలోని కౌలు రైతుల సమస్యలపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కౌలు రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కౌలు రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆందోళనలు నిర్వహిస్తున్న ఏమాత్రం పట్టించుకోకుండా, కౌలు రైతుల ను ఆవేదనకు గురిచేస్తుందని అన్నారు.భూ యజమానులు తో సంభంధం లేకుండా బ్యాంకులలో రుణాలు మంజూరు చేయాలని కోరారు. కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసి అనేక ఇబ్బందులు పడుతున్నారు అన్నారు. కౌలు రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. కుటుంబం అంత ఆరుగాలం శ్రమించిన అప్పులు తీరక కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బి.సురేంద్ర కుమార్,సిపిఐ పత్తికొండ పట్టణ కార్యదర్శి ఎన్.రామాంజనేయులు, రైతు సంఘం నలక దొడ్డి గ్రామ శాఖ నాయకులు కె.రవి కుమార్, కౌలు రైతులు నరేష్, రంగన్న, లోకార్జున, సోమలింగప్ప, అల్లి పిరా, మల్లికార్జున, పి.ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఉద్యమంగా సంజీవయ్య జిల్లాసాధన ఉద్యమం

బి నక్కల మిట్ట శ్రీనివాసులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్


నీతి నిజాయితీలతో కర్నూలు జిల్లాకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఖ్యాతి పొందిన దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని దామోదరం సంజీవయ్య జిల్లాసాధన సమితి ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా చేస్తున్న ఉద్యమం ప్రజా ఉద్యమంగా మారనున్నదని దామోదరం సంజీవయ్య జిల్లాసాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య, జిల్లా కన్వీనర్ జెవి.కృష్ణయ్య అన్నారు. రాజవిహార్ దర్గా, జిల్లాపరిషత్ ప్రాంగణంలో విస్తృతంగా కరపత్రాలను ప్రజలకు పంచిపెడుతూ వేలాదిగా దామోదరంసంజీవయ్య జిల్లాకు మద్దతుగా సంతకాలు సేకరించారు. ఎస్సీ,ఎస్టీ లాయర్ల ఫోరం రాష్ట్ర నాయకుడు వై.జయరాజు సంజీవయ్య జిల్లాకు మద్దతు తెలిపారు. సురవరం సుధాకరెడ్డి సంస్మరణ సభ కొరకు వచ్చిన అనంతపురం కు చెందిన 91సంవత్సరాల సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ సంజీవయ్యతో తన పరిచయాన్ని అయన సేవాగుణాన్ని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లాసాధన సమితి సలహాదారులు దామోదరంరాధాకృష్ణ, పి.రంగస్వామి, డాక్టర్ గోవర్ధన్, వర్మ, నగేష్ పాల్గొన్నారు.

జి.పుల్లరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఇన్ఫోసిస్, పాల్స్ టెక్‌జూకా 2025 లో 2వ బహుమతి


ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలుకు గర్వకారణంగా జి.పుల్లరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల (జిపి ఆర్ఇసి) విద్యార్థులు మరోసారి ప్రతిభ చాటారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎన్.హర్షవర్ధన్, ఎం భరణి కుమార్ రెడ్డి పల్లె లహరి రెడ్డిలతో కూడిన "సస్టైనబుల్ పై" బృందం, 2025 సెప్టెంబర్ 4న మహీంద్రా సిటీ, చెంగళ్‌పట్టు లోని ఇన్ఫోసిస్,పాల్స్ టెక్‌జూకా హ్యాకథాన్ 2025లో నిర్వహించిన జాతీయ స్థాయిలో 'రెండో బహుమతిని' కైవసం చేసుకుంది. ఈ పోటీలో దేశవ్యాప్తంగా 51 కళాశాలల నుండి వచ్చిన 98 బృందాలు పాల్గొన్నాయి. కఠినమైన ఈ పోటీలో వీరి ప్రాజెక్ట్ AI-Driven Smart Bin వినూత్నత, స్థిరమైన వ్యర్థ నిర్వహణకు దోహదం చేసే విధానంగా గుర్తింపు పొందింది.ఈ విజయానికి ఫ్యాకల్టీ మెంటర్ ఎం. విష్ణువర్ధన్ రెడ్డి మార్గదర్శకత్వం కీలకంగా నిలిచింది. కళాశాల యాజమాన్యం, అధ్యాపక వర్గం, సహ విద్యార్థులు ఈ విజయం పట్ల అభినందనలు తెలుపుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ అద్భుత విజయానికి Sustainable Pie బృందానికి హదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం



ఉపాధ్యాయ దినోత్సవ ప్రత్యేక అనుబంధం

పేజీలు : 8


శుక్రవారం 05 - సెప్టెంబర్ - 2025

గురువే దిక్సూచి

కర్నూలు 'ప్రతిభ' వేలాది ఉపాధ్యాయ అభ్యర్థుల కలల సాకారం

8వ పేజీలో..

- సమాజంలో వారిదే కీలక పాత్ర - నేడు ఉపాధ్యాయ దినోత్సవం



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

ఆదియుగం నుంచి ఆధునిక యుగం వరకు ఆయనే రుషి.. జీవన వికాసానికి నిచ్చెన వేసే అక్షర కార్మికుడు.. సమాజ దేవాలయానికి నిజమైన రక్షకుడు.. జీవితానికి దిక్సూచి.. ఆయనెవరో కాదు మనందరికీ విద్యా బుద్ధులు నేర్పే గురువు. అందుకే మన సమాజంలో అమ్మానాన్నల తర్వాతి స్థానం గురువులకు ఇచ్చారు. శిశువును లోకానికి పరిచయం చేసిన అమ్మ మొదటి గురువైతే.. గుండెలపై తన్నుతూ ఆటలాడే శిశువుకు నడక నేర్పే నాన్న రెండో గురువు. ఆ తర్వాత ఈ లోకంలో ఎలా నడుచుకోవాలో నేర్పి, విద్యా బుద్ధులు అందించే ఉపాధ్యాయుడు మూడో గురువు. అందుకే పెద్దలు మాతృదేవో భవ.. పితృదేవో భవ.. ఆచార్య దేవోభవ అన్నారు...

దేవుడు, గురువు పక్క పక్కనే ఉంటే నేను మొదట గురువుకే నమస్కరిస్తా అన్నారు మహానుభావుడు కబీర్ దాస్. ఎందుకంటే.. ఆయన భగవంతుడు అని మొదట తనకు చెప్పింది గురువే కాబట్టి అని వివరించారు. సమాజంలో గురువుకు ఉన్న స్థానం అంత గొప్పది. 'గు' అంటే చీకటి, 'రు' అంటే పోగొట్టేది అని అర్థం. అంటే మనలో అజ్ఞాన పొరలు తొలగించి, జ్ఞానదీప్తిని వెలిగించేవాడు గురువు అన్న మాట. అలాంటి గురువును దైవం కంటే మిన్నగా ఆరాధించే సంస్కృతి మనది.

నేపథ్యం..

భారత రత్న, భారతదేశ తొలి ఉప రాష్ట్రపతి డాక్టర్ (మిగతా 3వ పేజీలో...)

దశ మార్చిన గురువు...



గురువే ఆలంబనా
గురువే ఆలోచన
గురువే మార్గం
గురువే సత్యం
గురువే జీవం
జీవిత జ్యోతి నువ్వు
జ్ఞాన సంపద నువ్వు

అక్షరాలు దిద్దించి అమ్మవయ్యావు
బుద్ధి మాటలు చెప్పి నాన్నవయ్యావు
సలహాలు చెప్పి స్నేహితుడవయ్యావు
విద్యార్థి భవితవ్యాన్ని తీర్చిదిద్ది సృష్టికర్తవయ్యావు.

అమ్మ ,నాన్న జీవం పోస్తే
నువ్వు జీవితాన్ని ఇచ్చావు.
కష్టాలను సవాళ్లు గా స్వీకరించే ధైర్యం ఇచ్చావు

అక్షరాల నుండి ఆలోచన
ఆలోచన నుండి ఆచరణ
ఎక్కడా తొణకనివ్వక జాగ్రత్తగా అడుగులు వేయించావు.

అమ్మ అడుగులు నేర్పితే
నువ్వు నడత నేర్పావు
అమ్మ మాట నేర్పితే
నువ్వు మంచి తనం నేర్పావు
నాన్న అవసరాలు తీర్చితే
నువ్వు ఆకాశానికి ఎగిరేలా ప్రోత్సహించావు.

అదృష్టాన్ని కాక స్వశక్తిని నమ్మమన్నావు
శ్రమలోనే శక్తి ఉందని తెలిపావు.
నీతి, న్యాయం, ధర్మం బోధించావు.
ప్రతిక్షణం నీడలా తోడుగా ఉన్నావు.

శిలలాంటి వాడిని శిల్పంలా మలచావు.
మట్టి ముద్దను మాణిక్యం చేశావు.
వర్ణమాల నేర్పి వజ్రాన్ని చేశావు.
దశ, దిశను చూపి మార్గనిర్దేశం చేశావు.

అజ్ఞానాంధకారాన్ని రూపు మాపి విజ్ఞాన దివ్వెను వెలిగించే
జీవన జ్యోతివి.
దారి తెన్ను తెలియని విద్యార్థి జీవితంలో దార్శనికుడివి.

ఎన్ని అని చెప్పను నీ గొప్పతనం
తన కోసం కాక సమాజం కోసం, దేశం కోసం పోరాడే వీర జవానువి, ఉత్తమ పౌరులను, భవిష్యత్ తరాలను తీర్చిదిద్ది, ఏమీ ఆశించక విద్యార్థి వందనాన్ని మాత్రమే స్వీకరించే అల్పసంతోషివి.

నీలో జ్ఞానాన్ని మొత్తం ధారపోసే దానకర్ణుడివి.
గురువుని మించిన శిష్యుణ్ని ఉన్నతిని చూసి మురిసిపోయే మమతా మూర్తివి.
విద్యార్థులందరినీ సమంగా ప్రేమించే సమతా మూర్తివి.

తన కోసం కాక సమాజం కోసం జీవించే త్యాగమూర్తివి.

నువ్వు లేకుంటే చుక్కాని లేని నావను,
నీవు లేకపోతే దిక్సూచి లేని తోవను,

దొంగలు కూడా దోచుకోలేనిది మీరిచ్చిన ధనం.. ఏమిచ్చినా తీర్చుకోలేము
మీ రుణం...పాదాభివందనాలు తప్పా...

నాకు విద్య నేర్పిన గురువులందరికీ పాదాభివందనాలతో...
గుర్రం శైలజ ప్రేమ కుమారి,
స్కూల్ అసిస్టెంట్ తెలుగు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విరుపాపురం, ఆదోని.

సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తితో పని చేయాలి


ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తితో పనిచేసి తమ విధులకు న్యాయం చేస్తూ ఉత్తమ విద్యార్థులగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలని హెచ్ఎం అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ డి.సీ హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ కల్లూరు మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంచి ఫలితాలను సాధిస్తుందన్నారు.



2024- 2025 పదవ తరగతి ఫలితాల్లో 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని, సప్లమెంటరీలో అందరూ ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. స్పోర్ట్స్‌లోనూ ఈ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని, దీనికి ఉపాధ్యాయుని ఉపాధ్యాయుల కృషికి నిదర్శనమని అన్నారు.

- డిసి హుస్సేన్, కల్లూరు జడ్పీహెచ్ఎస్ స్కూల్ హెచ్ఎం.




గురువే సమాజానికి మార్గదర్శి


- జి అరుణ, రాయలసీమ యూనివర్సిటీ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్.

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్



గురువే సమాజానికి మార్గదర్శి, జ్ఞానం విలువల రూపకర్త అని రాయలసీమ యూనివర్సిటీ తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి అరుణ టీచర్స్ డే సందర్భంగా 'ప్రజాశక్తి'తో అన్నారు. అధ్యాపక వృత్తి అనేది సమాజ నిర్మాణంలో అత్యంత కీలకమైన స్థానం కలిగినది. విద్య అనేది వ్యక్తి వ్యక్తిత్వాన్ని, ఆలోచనలను, నైపుణ్యాలను, విలువలను తీర్చిదిద్దే స్థానం. ఈ విద్యను సమాజానికి అందించే ప్రధాన బాధ్యత అధ్యాపకులకు చెందుతుంది. ఉపాధ్యాయులు విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యం, అనుభవం పంచి వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తారు. విద్యార్థులలో మంచి నైజం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, విలువలు, గౌరవాన్ని పెంపొందిప చేస్తారు. విద్యావంతులైన పౌరులను తీర్చిదిద్దడం ద్వారా సమాజంలో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి దోహదపడతారు. అధ్యాపక వృత్తి అనేది నిత్య నూతన ఉత్సాహాన్ని కలిగించే వృత్తి. ఈ వృత్తి కొత్త ఆలోచనలకు, కొత్త విషయాలకు, కొత్త పరిశోధనలకు బాట వేస్తుంది. పిల్లల్లో ఆలోచనా శక్తిని, శాస్త్రీయతను, పెంపొందింప చేయడం అధ్యాపకుల బాధ్యత. అటువంటి వృత్తిలో ఉండటం నిజంగా గర్వకారణంగా చెప్పవచ్చు. అదేవిధంగా తెలుగు అధ్యాపకురాలిగా భాషాభివృద్ధికి బోధనతోనే కాకుండా ఆధునిక సాంకేతికతల ద్వారా మరింత విస్తృతమవుతుంది. తెలుగు భాషను ప్రపంచవ్యాప్తంగా విస్తరింప జేయడానికి కొత్త తరాలకు దగ్గర చేయడానికి వివిధ సాంకేతిక పద్ధతులు, డిజిటల్ ప్లాట్ ఫారంలు, ఈ బుక్స్, ఆడియో బుక్స్, సోషల్ మీడియా అండ్ యాప్స్ వేదికగా నిలబడుతున్నాయి. వివిధ సాంకేతిక పద్ధతులు ఉపయోగకరంగా దోహదపడుతున్నాయని ఆమె పేర్కొన్నారు.










ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

డాక్టర్ సర్వేపల్లిరాధాకృష్ణన్ ఒక తెలుగు బ్రాహ్మణ కుటుంబంలో 05-09-1888లో జన్మించారు. ఈయన గొప్ప ఉపాధ్యాయుడు, తత్వవేత్త, రాజనీతిజ్ఞుడు. ఈయన విధానాలు భారతదేశ విద్య, రాజకీయరంగాలలో తీవ్ర ప్రభావం చూపాయి. భారత మొదటి ఉపరాష్ట్రపతిగా 1952-62 వరకు, రెండవ రాష్ట్రపతిగా 1962-67 వరకు పని చేశారు. ఈయన విద్య, తత్వశాస్త్రానికి చేసిన సేవలకు ఈయన పుట్టిన రోజును మన దేశంలో 'ఉపాధ్యాయ దినోత్సవంగా' సందర్భంగా ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు..

పోతురాజు భాస్కర్, తెలుగు పాఠశాల సహాయకులు,
కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల, కర్నూలు.
















గురువే దిక్సూచి


మొదటి పేజీ తరువాయి... సర్వేపల్లి రాధాకృష్ణన్. ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 5ను ఉపాధ్యాయ దినోత్సవంగా

నిర్వహించుకుంటున్నాం. సర్వేపల్లి రాధాకృష్ణన్ 1888 సెప్టెంబరు 5న మద్రాసుకు ఈశాన్యంగా 64 కిలో మీటర్ల దూరంలో ఉన్న తిరుత్తణిలో తమిళనాడుకు వలస వెళ్లిన తెలుగుదంపతులు సర్వేపల్లి వీరాస్వామి, సీతమ్మ దంపతులకు జన్మించారు. వీరాస్వామి ఒక జమిందారీలో తహశీల్దార్. వారి మాతృభాష తెలుగు. సర్వేపల్లి బాల్యం, విద్యాభ్యాసం ఎక్కువగా తిరుత్తణి, తిరుపతిలోనే గడిచాయి. ప్రాథమిక విద్య తిరుత్తణిలో సాగింది. తిరుపతి, నెల్లూరు, మద్రాసు క్రిస్టియన్ కాలేజీల్లో చదివి ఎంఏ పట్టా పొందారు. 1906లో 18 సంవత్సరాల చిరుప్రాయంలో శివకామమ్మతో వివాహం జరిగింది. వీరికి ఐదుగురు కూతుళ్లు, ఒక కుమారుడు కలిగారు.

ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవం


ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 5న నిర్వహిస్తారు. ప్రపంచ ఉపాధ్యాయుల దినోత్సవాన్ని 1994వ సంవత్సరం నుండి అక్టోబరు 5 నుండి జరుపుతున్నారు. అంతర్జాతీయ విద్యా వైజ్ఞానిక సాంస్కృతిక సంస్థ (యునెస్కో) 1966 సెప్టెంబర్ 21 నుండి 15 రోజుల పాటు పారిస్‌లో ఉపాధ్యాయుల పరిస్థితిపై ప్రత్యేకంగా అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. అనేక దేశాలు, ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ కార్మిక సంస్థ, వివిధ ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు పాల్గొన్న ఆ సదస్సు ఉపాధ్యాయుల హోదా పెంచడానికి, వారి హక్కులు, బాధ్యతలకు సంబంధించి కొన్ని నిర్దిష్ట సిఫారసులతో సమగ్రమైన పత్రాన్ని ఆమోదించింది. 'స్టేటస్ ఆఫ్ ది టీచర్స్' పత్రాన్ని ఆమోదించిన అక్టోబరు 5న ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించి, సదరు సిఫార్సుల అమలును ప్రతిఏటా సమీక్షించాలని నిర్ణయించింది.













ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటలు

- యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్.బాలాజీ రావు

ప్రజాశక్తి - కొత్తపల్లి


ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, సమస్యల పరిష్కారం కోసం నిరంతరం అలుపెరగని పోరాటాలు చేసేది ఒక్క యుటిఎఫ్ మాత్రమేని యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్.బాలాజీ రావు తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. యుటిఎఫ్ ప్రత్యేక చొరవతో ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటు పడుతుందన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి పలు రకాల ఆటంకాలు కలిగించే జీవోలు తెచ్చిందన్నారు. జీవో 117 పట్ల ఉన్నత పాఠశాలలో సెక్షన్‌ల నిష్పత్తి 1:49గా చేయడం, సిపిఎస్ రద్దు, మెమో నంబర్ 57 అమలు దిశగా, యాప్‌ల భారం తగ్గించాలని, శాస్త్రీయ వైఖరిని అవలంభించే విధంగా బోధనలో మార్పు తీసుకు రావడంలో యుటిఎఫ్ ప్రత్యేక కృషి చేసిందన్నారు. పిఆర్సి సాధన, ఆర్థిక బకాయిల చెల్లింపుల పట్ల నిరంతరం పోరాడు తుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు ఎక్కడ ఉన్నా పోరాటాలు చేసేందుకు యుటిఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.


మాట్లాడుతున్న యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎస్.బాలాజీ రావు























విద్యార్థులుగా చేరండి.. ఉద్యోగులుగా వెళ్లండి..

● బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల చైర్మన్ సూదిరెడ్డి శ్రీధర్ రెడ్డి



బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

'విద్యార్థులుగా చేరండి.. ఉద్యోగులుగా వెళ్లండి..' నినాదంతో ముందుకు సాగుతూ, తమ కళాశాలలో క్యాంపస్ సెలక్షన్లు నిర్వహిస్తూ, అనేక మంది విద్యార్థులను ఉద్యోగులుగా తీర్చిదిద్దుతూ నినాదాన్ని ఆచరణలో అమలు చేసి చూపుతున్నామని బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాల చైర్మన్ సూది రెడ్డి శ్రీధర్ రెడ్డి, కరెస్పాండెంట్ వివిఎన్.సత్యనారాయణ, డైరెక్టర్ సుధీర్ రెడ్డి రమేష్ రెడ్డి పేర్కొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వారు ప్రజాశక్తితో మాట్లాడారు. బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలను 2008 సంవత్సరంలో స్థాపించినట్లు తెలిపారు. ప్రారంభమైన మొదటి సంవత్సరంలో బిఎస్సి, బికాం, బిఎ గ్రూపులలో 62 మంది విద్యార్థులతో కళాశాలను ముందుకు నడిపించినట్లు పేర్కొన్నారు. ప్రారంభించిన మొదటి సంవత్సరం నుండి నేటి వరకు ఉత్తమ ఫలితాలలో అద్భుతమైన విజయాలకు సాధిస్తూ 18 సంవత్సరాల సుధీర్ఘ ప్రయాణం కొనసాగిస్తున్నామని తెలిపారు. 2015 విద్యా సంవత్సరం నుండి 'విద్యార్థులుగా చేరండి.. ఉద్యోగులుగా మారండి..' నినాదంతో నేటి వరకు 982 మంది విద్యార్థులకు కళాశాలలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ ద్వారా శిక్షణ, అత్యుత్తమ క్రమశిక్షణ ద్వారా వివిధ రకాల మల్టీ నేషనల్ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు పొందారని పేర్కొన్నారు. బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో అపార అనుభవం కలిగిన విద్యావేత్తలు యాజమాన్యంగా ఉంటూ విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారని తెలిపారు. అనుభవం కలిగిన అధ్యాపకుల బృందం చేత విద్యాబోధన చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే అర్హులైన విద్యార్థినీ విద్యార్థులకు ఫీజు రీయంబర్స్మెంట్ సదుపాయం, ప్రతి విద్యార్థిని ఉత్తమ ఉత్తీర్ణత శాతంతో ఫలితాలను సాధించే విధంగా అధ్యాపకులు తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి ఉత్తీర్ణత శాతం పెంచడానికి అధ్యాపకులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంత తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును ఆలోచించి వారి మంచి భవిష్యత్తుకు బాటలు వేయడానికి బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో చేర్పించాలని కోరారు. బసిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బిఎస్సి విభాగంలో కంప్యూటర్ సైన్స్, బాటని, జువాలజీ, మైక్రో బయాలజీ, ఆక్వాకల్చర్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బిఎ విభాగంలో పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, స్పెషల్ ఉర్దూ కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపల్ మన్సూర్ అహ్మద్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో బి.ఏ విద్యార్థులు వరుసగా మూడు సంవత్సరాలు యూనివర్శిటీ టాపర్స్‌గా నిలిచారని పేర్కొన్నారు. అలాగే 2025లో ఐదు మంది విద్యార్థులు కానిస్టేబుల్ ఉద్యోగాలకు, 6 మంది విద్యార్థులు టీచర్ ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. ప్రయివేటు ఉద్యోగాలతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల కోసం విద్యార్థులకు మంచి సలహాలు సూచనలు ఇస్తామన్నారు.



ప్రిన్సిపల్ మన్సూర్ అహ్మద్







గురువు మించిన దైవం లేదు : నూర్ అహ్మద్

ప్రజాశక్తి - ఆదోని

తల్లిదండ్రులు జన్మనిచ్చినా, విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులను చేసిన ఘనత గురువులకే దక్కుతుంది. అలాంటి గురువులను స్మరించుకోవడం కనీస ధర్మం. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించిన గురువులందరికీ గురు పూజోత్సవ శుభాకాంక్షలు.



అక్షర సేద్యం చేస్తున్న
నాగలిపట్టని హాలికుడు
గురువు.
అజ్ఞానమనే అంధకారాన్ని
తొలగించి విద్యార్థులలో
జ్ఞానజ్యోతిని వెలిగించేది
గురువు.
గమ్యంలేని విద్యార్థి జీవితాన్ని
గమ్యం వైపు నడిపించేది
గురువు.
అపక్రమపు రాయిలాంటి
విద్యార్థి జీవితాన్ని అందమైన
శిల్పంగా మార్చే గొప్ప శిల్పి
గురువు.
లోకంలో ఎన్ని వత్తులున్న
అన్నింటికి మూలస్తంభం
గురువు.

పి. రమాదేవి ఎస్.ఏ హిందీ.



చదువుతోనే అభివృద్ధి

- బషీర్ అహ్మద్, సీనియర్ అడ్వకేట్, ఆదోని

ప్రజాశక్తి - ఆదోని

చదువుతోనే అభివృద్ధి సాధ్యం. చదువుతోపాటు విద్యా బుద్ధులు నేర్పి ప్రయోజకులను చేసిన గురువులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ ప్రభుత్వం మెరుగైన విద్యనందించి పేద విద్యార్థులకు బాసటగా నిలవాలి.



చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో.. భూమిని చూసి ఓర్పును నేర్చుకో.. చెట్టును చూసి ఎదుగుదలను చేర్చుకో.. ఉపాధ్యాయుని చూసి సుగుణాలు చేర్చుకో.. గురువులందరికీ 'ప్రజాశక్తి' ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు..

అక్షరశ్రీలో మెరుగైన విద్య

- సుధాకర్ రెడ్డి, అక్షరశ్రీ స్కూల్ కరస్పాండెంట్, ఆదోని



ప్రజాశక్తి - ఆదోని

మెరుగైన విద్యనందిస్తూ అక్షర స్కూల్ విద్యాసంస్థలను ఆదోనిలో మొదటి స్థానంలో నిలిపిన విద్యార్థులకు, గురువులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు. ఆదోని నెట్టేకల్ రోడ్డులో అక్షరశ్రీ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పాం. మెరుగైన విద్యనందిస్తూ ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిన ఘనత అక్షరశ్రీకి ఉంది.

ముందు వరుసలో 'సాయిభారతి'

- బీసీ.దుర్గేష్, సాయి భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, ఆదోని



ప్రజాశక్తి - ఆదోని

టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందుతున్న సమాజానికి ధీటుగా విద్యనందిస్తూ సాయి భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ముందు వరుసలో ఉంది. ఎందరో విద్యార్థులకు మెరుగైన విద్యనందించి ఉన్నత విద్యకు బాసటగా నిలిచాం. గురువులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు.

విద్యాభివృద్ధికి పునాది

'శ్రీసరస్వతి విద్యాపీఠం'

- కరస్పాండెంట్ ఎన్.లింగమూర్తి

ప్రజాశక్తి - నందవరం



వేల మంది విద్యార్థుల విద్యాభివృద్ధికి 'శ్రీసరస్వతి విద్యాపీఠం' పునాదులు వేసిందని కరస్పాండెంట్ ఎన్.లింగమూర్తి తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. 1992వ సంవత్సరంలో పాఠశాలను స్థాపించినట్లు తెలిపారు. 33 ఏళ్లుగా విద్యారంగం, క్రీడారంగంలోనూ విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన విద్యావంతులతో విద్యను బోధిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడలు ఆడుకోవడానికి విశాలమైన పాఠశాల ఆవరణం ఏర్పాటు చేశామని చెప్పారు. గ్రామంలోని వేల మంది విద్యార్థులు విద్యనభ్యసించి వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలో ఉన్నారని తెలిపారు. ప్రజలకు తమ పాఠశాల, యాజమాన్యంపై పూర్తి నమ్మకం ఉందని చెప్పారు. వారి పిల్లలకు విద్య, క్రమశిక్షణతో పాటు మౌలిక సదుపాయాలు, పూర్తి రక్షణ కల్పిస్తున్నామని తెలిపారు.

అనతి కాలంలో 'లిటిల్ జీనియస్'కు గుర్తింపు

- కరస్పాండెంట్ శివ కుమార్

ప్రజాశక్తి - నందవరం



అతి తక్కువ కాలంలో నందవరం గ్రామంలో లిటిల్ జీనియస్ పబ్లిక్ స్కూల్ మంచి గుర్తింపును సాధించిందని కరస్పాండెంట్ శివ కుమార్ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. స్థాపించిన సంవత్సర కాలంలోనే 300 విద్యార్థులతో పాఠశాల నందవరం గ్రామంలో మంచి స్థానాన్ని సంపాదించిందని తెలిపారు. నందవరం, వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వచ్చి విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. విశాలమైన స్కూల్ ఆవరణం, చుట్టూ పచ్చని చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం, ఆకర్షనీయంగా విద్యార్థులను ఆకట్టుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మంచి విలువలతో కూడిన విద్యనందించడమే లక్ష్యంగా స్కూల్ స్థాపించినట్లు చెప్పారు. స్థాపించిన నాటి నుంచి విద్యార్థులకు బస్సు సౌకర్యం, తాగునీరు, ఆడుకోవడానికి విశాలమైన మైదానం ఏర్పాటు చేశామన్నారు.

మంత్రి ప్రశంస మరింత బాధ్యత పెంచింది

- ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాల



ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ పురపాలక ఉన్నత పాఠశాలకు బడి తెరిచిన ప్రారంభంలో రోజూ సిఫారసు లేఖలతో విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను బడిలో చేర్చుకోవాలని క్యూ కట్టారు. 'ఫుల్' అని నోటీస్ బోర్డు పెట్టడంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ ద్వారా అభినందించడంతో మరింత బాధ్యత పెరిగిందని ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్ తెలిపారు. ఇప్పటికే 6 నుంచి 10వ తరగతి వరకు పాఠశాలలో 1,725 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కో గదిలో 120 మందికి పైగా విద్యార్థులు కూర్చుంటున్నారు. తరగతి గదులు చాలక ఉపాధ్యాయులు కూర్చోవడానికి స్థలం లేదని 'బడిలో చేర్చుకోలేమ'ంటూ జులై నెలలో నోటీసు బోర్డు పెట్టేశారు. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో సమూలమైన మార్పులు చేసి సన్న బియ్యంతో విద్యార్థులకు భోజనం వడ్డించడం, తల్లికి వందనం కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి రూ.13 వేలు జమ చేయడంతో ప్రభుత్వ పాఠ శాలలకు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

అదనపు తరగతులు నిర్మిస్తే...

కేవలం 20 గదులు మాత్రమే ఉన్నాయి. విద్యార్థులకు ఏమాత్రం సరిపోవడం లేదు. గత వైసిపి ప్రభుత్వం నాడు-నేడు కింద అదనపు తరగతి గదులు 12 గదులు నిర్మించినా అవి మొండి గోడలకే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తే పాఠశాల అభివృద్ధితోపాటు ఉత్తీర్ణత శాతం పెరుగుతుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

నారా లోకేష్ అభినందన...

'ఆదోని మున్సిపల్ నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 'నో అడ్మిషన్' బోర్డు చూసి చాలా ఆనందించాను. 1,725 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ఈ ఏడాది అన్ని తరగతుల్లోనూ 400 మందికి పైగా కొత్త విద్యార్థులు చేరడం ప్రభుత్వ విద్య పట్ల ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనం. 'నో అడ్మిషన్' బోర్డు పెట్టి, అడ్మిషన్లు క్లోజ్ చేశామని తల్లిదండ్రులకు నచ్చజెబుతున్నా.. 'మా పిల్లాడి ఒక్కని చేర్చుకోండి సార్' అంటూ బతిమాలుతుంటే కాదనలేకపోతున్నామని చెబుతున్న ప్రధానోపాధ్యాయులు ఫయాజుద్దీన్, ఉపాధ్యాయులు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి పాఠశాలలో ఇలాగే 'నో అడ్మిషన్' బోర్డులు కనిపించాలి. తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్య పట్ల నమ్మకం కల్పించిన ఉపాధ్యాయులే ఎపి మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దే రథసారథులు' అంటూ నారా లోకేష్ ట్విట్టర్ ద్వారా అప్పట్లో అభినందించారు.

ప్రభుత్వ ప్రోత్సాహం, ఉపాధ్యాయుల కృషి
- ఫయాజుద్దీన్, ప్రధానోపాధ్యాయులు



ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలతో తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై మరింత నమ్మకం కలిగింది. మా పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులకు క్యూ కడుతున్నారు. ఉపాధ్యాయులు నూతనమైన బోధనతో ఆకట్టుకుంటున్నారు. విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టడం వల్ల వారందరూ మా పాఠశాలలో చేర్పించేందుకు ఆసక్తి చూపుతున్నారు. తరగతి గదులు తక్కువగా ఉండడం వల్ల విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వలేకపోతున్నాం.

విద్యార్థులకు మార్గదర్శి గురువు

- కృష్ణమూర్తి, నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్, పెద్ద తుంబలం, ఆదోని



ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థులకు మార్గదర్శి గురువు. విద్యార్థులకు విద్యాబుద్ధి నేర్పి ఉపాధ్యాయుడు మార్గదర్శిగా నిలుస్తారు. తల్లిదండ్రులు జన్మనిస్తే భవిష్యత్తు ఇచ్చేవారే గురువు. విద్య నేర్పి భవిష్యత్తును తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు.



కార్పొరేటుకు ధీటుగా...

- మల్లికార్జున, ప్రధానోపాధ్యాయులు, మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆదోని

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో పురాతన పాఠశాలలో మున్సిపల్ హైస్కూల్ ముందు వరుసలో ఉంది. సుమారు 1,400 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా విద్యనందిస్తున్నాం. ఉపాధ్యాయులందరికీ గురుపూజోత్సవ శుభాకాంక్షలు.

గురువులకు శుభాకాంక్షలు...

- నజీర్ హుస్సేన్, రెవెన్యూ ఆఫీసర్, ఆదోని మున్సిపాలిటీ



ప్రజాశక్తి - ఆదోని

చదువుతోపాటు మంచి, చెడు నేర్పి ఎందరో విద్యార్థులను ప్రయోజకులను చేసిన గురువులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు.

బోధనా సిరి'మువ్వ' గోవిందు



-విద్యార్థుల ప్రగతి తోవ -30 ఏళ్లుగా విద్యాసేవలు
-సామాజిక సేవలోను ముందు
-ఉపాధ్యాయ శిక్షకులకు మార్గదర్శనం
-2500 మంది జీవితాల్లో వెలుగులు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

గురువు అంటే కేవలం అక్షరాలు నేర్పే వ్యక్తి కాదు. జీవితాల్లో వెలుగులు నింపే జ్ఞానశక్తి.గురువు అనే అక్షరంలోనే గొప్పతనం ఉంది. 'గు' అంటే చీకటిని తొలగించేదని, 'రు' అంటే వెలుగును ప్రసాదించేదని అర్థం. తల్లిదండ్రులు మనకు శరీరాన్ని ఇస్తే, గురువు మనకు జ్ఞానాన్ని, ఉన్నతమైన ఆలోచనలను ప్రసాదిస్తాడు. ఎంత గొప్పవాడైనా సరే, తన ఎదుగుదల వెనుక గురువు పాత్ర తప్పనిసరి. ఇది కాదనలేని సత్యం. ఇలాంటి లక్షణాలతోపాటు అదనంగా ముక్కుసూటి తనం, తప్పు చేస్తే సరిదిద్ది సక్రమ మార్గంలో ప్రయాణం నడిపే క్రమశిక్షణ, ఆపద అంటే అండగా నిలిచే ధైర్యం, ఆదుకునే కరుణా హృదయం వంటి లక్షణాలు వెరసి అలాంటి వ్యక్తి విద్యార్థులకు గురువుగా దొరికితే విద్యార్థులకు అంతకన్నా భాగ్యం మరొకటి ఉంటుందా? సరిగ్గా అలాంటి వ్యక్తిత్వం కలిగిన విద్యబోధన సిరిమువ్వ, క్రమశిక్షణా నిప్పురవ్వ, పేద విద్యార్థుల నోటి బువ్వ, ఉపాధ్యాయ శిక్షణార్థుల ప్రగతి తోవ, గమ్యానికి చేర్చే బతుకు జీవనావా. ఇంకెవరో కాదు ఆయనే మన గోవిందు మువ్వా. ఆయన కర్నూలు డైట్ కళాశాలలో సోషల్ అండ్ సైన్సెస్ విభాగం అధిపతి, సీనియర్ అధ్యాపకులుగా ప్రస్తుతం పని చేస్తున్నారు. ఆయన గురించి తెలుసుకుందాం.

మువ్వా గోవిందు సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. ఆయన 1995 సంవత్సరంలో సోషల్ స్కూల్ అసిస్టెంట్‌గా దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామంలో తొలిసారి విధుల్లో చేరారు. ఆపై పలుచోట్ల ఉపాధ్యాయుడుగా పనిచేస్తూ 2003లో కర్నూలు మండలం, బి తాండ్రపాడులోని డైట్ కళాశాల సోషల్ సైన్సెస్ మెథడాలజీ అధ్యాపకునిగా పదోన్నతి పై బదిలీ అయ్యారు. ఆపై 2024లో అదే కళాశాలలో సీనియర్ అధ్యాపకునిగా, సోషల్ అండ్ సైన్సెస్ విభాగం అధిపతిగా పదోన్నతి పొందారు.

శిక్షణార్థులకు మార్గదర్శి : తాను తన ఉపాధ్యాయ వృత్తిని ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు దాదాపు 30 ఏళ్లుగా నిరాటంకంగా విద్యారంగానికి సేవలందిస్తూ వస్తున్నారు. సుమారు 2500 మంది ఉపాధ్యాయ శిక్షణార్థులకు శిక్షణనిస్తూ మార్గదర్శిగా నిలిచారు. ఇందులో ఇప్పటివరకు వేయి మంది పైగా తన విద్యార్థులు ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. తాజాగా ప్రభుత్వం నిర్వహించిన డిఎస్‌సి 2025లో మరోవెయ్యి మంది శిక్షణార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసుకుని ఉద్యోగ బాధ్యతలు చేపట్టడమే తరువాయిగా నియామక ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల నిర్వహించిన డిఎస్‌సి 2025 ఎస్‌జిటిలో ఆయన విద్యార్థులు వరుసగా 1,3,4 జిల్లా ఉత్తమ ర్యాంకులను సాధించడం విశేషం. ఇవే కాకుండా తమ విద్యార్థులు ఎంతోమంది వివిధ ప్రముఖ రంగాల్లో కూడా స్థిరపడ్డారు. విద్యార్థులకు ఎప్పుడు, ఎలాంటి సమస్యలు ఎదురైనా వాటి పరిష్కారానికి తగిన సూచనలు సలహాలు ఇస్తూ మార్గదర్శకులుగా నిలుస్తున్నారు.

రెండుసార్లు ఉత్తమ అవార్డులు: ఆయన విద్యా సేవలను, విద్యారంగంలో ఆయన తీసుకొస్తున్న ఫలితాలను ఆధారంగా చేసుకొని రెండు జిల్లా ఉత్తమ అవార్డులు ఆయనను వరించాయి. ప్రధానంగా 2001వ సంవత్సరంలో గూడూరు మండలం పోలకల్‌లోఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమయంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గాను, 2022లో డైట్ కళాశాలలో ఉత్తమ అధ్యాపకుడిగా ప్రశంస పత్రం, ప్రతిభా పురస్కారాలను ప్రభుత్వం నుంచి అందుకున్నారు.

సామాజిక సేవలో: తన చిన్ననాటి నుంచి పేదరికాన్ని పేదల ఇబ్బందులను కళ్లారా చూసిన తాను... పేదలన్న పేదరికం అన్న ఇట్టే చెలించి పోతారు. తన విద్యార్థుల్లో చెన్నయ్య అనే దళిత అతి పేద విద్యార్థి దారిద్ర్యాన్ని చూసి చలించిన ఆ హృదయం. నేటికీ తన సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తూనే ఉన్నారు. సేవా దృక్పథంతో నిరుపేద విద్యార్థినీ విద్యార్థులకు ఎంతోమందికి హాస్టల్ ఫీజులు, పుస్తకాలు యూనిఫాంలు, రూమ్‌అద్దెలు, నిత్యవసర సరుకులు విద్యార్థులకు అందజేస్తూ తన సేవా స్ఫూర్తిని ప్రదర్శిస్తున్నారు.ఉపాధ్యాయులు విద్యార్థుల సమస్యలను తెలుసుకుని స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించాలని, వారిని ఉన్నత స్థానంలో నిలిపేందుకు నిరంతరం అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని అప్పుడే గురువు స్థానానికి సార్థకత లభిస్తుందని అన్నారు. ఇంతసేవా దృక్పథం ఉన్నా ఏమాత్రం గర్వం లేకుండా విద్యార్థుల విజయాలే తమకు నిజమైన అవార్డులు అని ఆయన చెబుతుండడం ఆయన నిరాడంబరత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఆయన సేవలను ఉపాధ్యాయ శిక్షణార్థులు,విద్యార్థులు పలువురు ఉపాధ్యాయులు హర్షిస్తున్నారు.

నిరంతర విద్యార్థి ఉపాధ్యాయుడు

మధు తెలుగు అధ్యాపకులు డైట్ కళాశాల

ఉపాధ్యాయుడు నిరంతరం విద్యార్థిగా ఉండాలి. అజ్ఞాన అంధకారాన్ని రూపుమాపి జ్ఞాన వెలుగులు ప్రసాదించేవాడే గురువు. నిత్య చైతన్య సామాజిక జీవి ఉపాధ్యాయుడు నైతిక ప్రవర్తనకు ఆదర్శ జీవికి ప్రతిరూపం గురువు అలాంటి గురువులను గౌరవించుకోవడం సమాజం బాధ్యత.



గురుపూజోత్సవ శుభాకాంక్షలు

- గుడిసె రామకృష్ణ, అమరావతి స్కూల్ కరస్పాండెంట్



ప్రజాశక్తి - ఆదోని : గురువులకు శుభాకాంక్షలు. ఎంతోమంది విద్యార్థులకు చదువుతో పాటు మంచి, చెడు నేర్పించడంలో తల్లిదండ్రులకు మించిన బాధ్యత గురువులది. ఆ స్థానంలో ఉండి చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు తీర్చి దిద్దుతున్న గురువులకు గురుపూజోత్సవ శుభాకాంక్షలు.

గురువు నైతికతకు మార్గదర్శి

- జి.బి. ఇమ్మానుయేల్, చరిత్ర అధ్యాపకుడు.



గురువు నైతికతకు మార్గదర్శి. నవసమాజ సృష్టికర్త. దేశభవిషత్ పునాది తాను మండుచు విద్యార్థులకు వెలుగునిచ్చు దైవం. నిస్వార్థచింతనకు పుత్ర వాత్సల్యంతో విద్యార్థుల జీవితాలను తిర్చిదిద్దుతూ అజ్ఞాన చీకటినీ పారద్రోలి జ్ఞానదీపికలను వెలిగించే ఆధు నిక పీఠాధి పతులు గు రువులు. గురు బ్రహ్మ గురు విష్ణు గురు సాక్షత్ పరబ్రహ్మ గురివేనమః.

కర్నూలు 'ప్రతిభ' వేలాది ఉపాధ్యాయ అభ్యర్థుల కలలసాకారం

-30 ఏళ్ల సాధన, లక్షల కుటుంబాల ఆనందం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పోటీ పరీక్షల్లో విజయాలకు చిరునామాగా నిలిచిన కర్నూలు ప్రతిభ కోచింగ్ సెంటర్, గత మూడు దశాబ్దాలుగా వేలాది మంది అభ్యర్థుల జీవితాలను మార్చింది. ఉద్యోగం అనే కలతో అడుగుపెట్టిన అభ్యర్థులను విజయతీరాలకు చేర్చుతూ, ఈ సంస్థ లక్షలాది కుటుంబాల్లో ఆనందాన్ని నింపింది.

ప్రారంభం నుంచే అద్భుత ఫలితాలు: 1996లో ప్రతిభా కోచింగ్ సెంటర్ మిత్రులతో స్థాపన చేసిన వెంటనే మొదటి సంవత్సరంలోనే 54 మంది ఉద్యోగాలు సాధించారు. రెండు సంవత్సరాలకే ఆ సంఖ్య 128కి పెరిగింది. 2000లో 200 మందికి పైగా, 2002లో 400 మందికి పైగా, 2006లో మరోసారి 400 మందికి పైగా అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో నిలవడం ప్రతిభ శిక్షణ స్థాయిని నిరూపించింది. ప్రత్యేకించి 2008లో ప్రభుత్వంచే 45,800 పోస్టులు విడుదల కావడంతో 1282 మంది అభ్యర్థులు ప్రతిభ శిక్షణతో ఉద్యోగాలు సాధించడం చరిత్రలో నిలిచిపోయే ఘట్టం. తదుపరి సంవత్సరాల్లో కూడా విజయాలు ఆగలేదు. 2012లో 380 మంది, 2014లో 400 పైగా, 2018లో 419 మంది ఉద్యోగాలు సాధించారు.



2025 డిఎస్‌సిలో ప్రతిభ ఆధిపత్యం : తాజాగా జరిగిన 2025 డిఎస్‌సిలో 600 మందికి పైగా అభ్యర్థులు ప్రతిభలో కోచింగ్ తీసుకుని ఉద్యోగాలు సాధించారు. అంతేకాకుండా రాష్ట్రస్థాయి టాప్ ర్యాంకులు సాధించడం ప్రతిభ ప్రతిభను మరోసారి నిరూపించింది.

టాప్ ర్యాంకులు సాధించిన వారిలో: వి. నాగరాజు- స్కూల్ అసిస్టెంట్ బయాలజీ 1వ ర్యాంక్ ,జి. పుల్లయ్య- ఫిజికల్ సైన్స్ 3వ ర్యాంక్, షాభా అంజూమ్ - ఎస్‌జిటి 2వ ర్యాంక్, సంపత్ కుమార్, తెలుగు 5వ ర్యాంక్, సుమలత-సోషల్ 8వ ర్యాంక్, సుధారాణి - బయాలజీ 2వ ర్యాంక్, చంద్రకళ-టిజిటి 8వ ర్యాంక్ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో టాప్-10 ర్యాంకుల్లో కర్నూలు ప్రతిభ విద్యార్థులు 24 మంది అన్ని విభాగలలో నిలవడం గర్వకారణం.

30 ఏళ్ల సాధన- లక్షల కుటుంబాల ఆనందం: ప్రతిభా కోచింగ్ సెంటర్ కేవలం శిక్షణా కేంద్రం కాదు. ఇది జీవితాలను మార్చిన ఒక వేదిక.పేదరికంలో ఉన్నవారు. గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన వారు. అవకాశాలు లేని వారు వారందరికీ "నాకు కూడా ఉద్యోగం వస్తుంది" అన్న నమ్మకం కలిగించింది.30 ఏళ్లలో వేలమంది అభ్యర్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో నిలిచి, లక్షలాది కుటుంబాల్లో ఆనందభాష్పాలు తెప్పించారు.

సామాజిక బాధ్యత-ఉచిత కోచింగ్ సేవలు: ప్రతిభా కోచింగ్ సెంటర్ కేవలం ఉద్యోగాలకే పరిమితం కాలేదు. సమాజం పట్ల తన బాధ్యతను గుర్తించి, తల్లిదండ్రులు లేని అభ్యర్థులకు, వితంతువులకు, వికలాంగులకు ఉచితంగా కోచింగ్ అందిస్తోంది. అంతేకాదు, రానున్న కాలంలో కూడా ఇలాంటి అభ్యర్థులకు ఎల్లప్పుడూ ఉచితంగా శిక్షణ అందిస్తామని సంస్థ డైరెక్టర్ అరుణాచల రెడ్డి స్పష్టంగా పేర్కొన్నారు. ఈ నిర్ణయం అనేక నిరుపేద కుటుంబాలకు ఆశాకిరణంగా మారింది.



విజయ రహస్యం-ప్రతిభ శిక్షణ విధానం: ప్రతిభ విజయాల వెనుక ఉన్న ప్రధాన బలాలు. నిపుణులైన అధ్యాపకులు, ప్రత్యేకమైన స్టడీ మెటీరియల్, క్రమమైన పరీక్షలు,ప్రతి ఆదివారం పరీక్షలు, వ్యక్తిగత శ్రద్ధ, ప్రతి అభ్యర్థిపై ప్రత్యేక దృష్టి ఈ సమన్వయమే ప్రతిభను రాష్ట్రంలోనే కాదు, దేశవ్యాప్తంగా కూడా విశ్వసనీయ కోచింగ్ సెంటర్‌గా నిలబెట్టింది.

విజయాల వెనుక మార్గదర్శి : ఈ విజయాల వెనుక ఉన్న ప్రేరణ ప్రతిభా డైరెక్టర్ అరుణాచల రెడ్డి మరియు మిత్ర బృందం కలిసివిద్యార్థులపై అపారమైన విశ్వాసం, శ్రమ పట్ల నిబద్ధత, ప్రతి అభ్యర్థిని కుటుంబ సభ్యుడిగా చూసే మనసు,ఇవన్నీ కలిసే ప్రతిభను నేటి స్థాయికి తీసుకొచ్చాయి.



పాఠశాల అంటే ప్రాణం

సొంత ఖర్చులు వెచ్చించి అభివృద్ధి

- ప్రధానోపాధ్యాయురాలు విజయమ్మ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

పాఠశాలన్నా విద్యార్థులున్నా ఆమెకు ప్రాణం. విద్యాభివృద్ధి అంటే ఆమెకు ఎంతో ఇష్టం. అందులో విద్యార్థులను క్రమ శిక్షణగా తీర్చిదిద్దడం, అవసరమైతే ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి బడికి రాని పిల్లలను సైతం పాఠశాలకు వచ్చేందుకు తీవ్ర కృషి చేస్తారు. ఆమె ఎవరో కాదు పసుపుల జిల్లా పరిషత్తు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.విజయమ్మ. విజయమ్మ తాను ఎక్కడ పని చేసినా అక్కడి విద్యార్థులతో మమేకమవుతారు. ప్రథమంగా పాఠశాలను అన్ని విధాల సరిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తారు. ముఖ్యంగా ఆమె పాఠశాలలో చదువుతోపాటు అందుకు అనుకూల వాతావరణం ఉండాలని విశ్వసిస్తారు. పాఠశాలలో మొదట్లో ఎత్తుపల్లాలతో విద్యార్థుల ఆటపాటలకు అసౌకర్యంగా ఉన్న గ్రౌండ్‌ను రూ. 1.30 లక్షలను తన ఆర్థిక సహాయంతో పాటు, ఉపాధ్యాయుల సహకారంతో రూపురేఖలు మార్చివేశారు. అంతేకాకుండా విద్యార్థుల ఆట పాటల కోసం ప్రత్యేక వేదికను నిర్మించారు. గాంధీజీ విగ్రహాన్ని సొంత నిధులతో ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో ఈ సదరు పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో ఐదు గురు విద్యార్థులు వెయిట్‌లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. యోగాలో రాష్ట్రస్థాయిలో ఒక విద్యార్థి ఎంపికయ్యారు. ఇది విద్యార్థులకు క్రీడలో హామీ ఇస్తున్న ప్రోత్సాహంగా తెలుస్తోంది. పదోతరగతి విద్యార్థులకు తన పనిని పక్కనపెట్టి సెలవు రోజుల్లో సైతం ప్రత్యేక క్లాసులు బోధిస్తున్నారు. తన సబ్జెక్టును మాత్రమే కాకుండా ఖాళీ పోస్టులుగా ఉన్న ఇతర సబ్జెక్టులను కూడా ఆమె బోధిస్తుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆమె కృషి మరింత ఫలించాలని ఆమె చేస్తున్న కషిని స్థానిక ప్రజలు హర్షిస్తున్నారు.